# మహిళా సాధికారత

MAHILA SADHIKARATHA

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాసపత్రిక

mas

సంపుటి :17 సంచిక: 10 రంగారెడ్డి జూన్ 2019 పేజీలు : 36 వెల : రూ. 10/-




ప్రపంచ పర్యావరణ దినోత్సవం .....
జూన్ 5 వ తేదీ

నవ్యాంధ్రప్రదేశ్‌లో నూతన అధ్యాయం!




ముఖ్యమంత్రిగా శ్రీ వై ఎస్ జగన్‌మోహన రెడ్డి ప్రమాణ స్వీకారం



వానలు కురవాలి ...
ఏరువాక సాగాలి !


Brot für die Welt బ్రెడ్ ఫర్ ది వరల్డ్ సౌజన్యంతో

## స్త్రీ నిధి 6వ సర్వసభ్య సమావేశ దృశ్యాలు










తెలంగాణాలోని ధరణి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం ప్రథమ వార్షికోత్సవం









బహుళ ప్రయోజన పవర్ వీడర్ వినియోగంలో శిక్షణ - భవిష్య కార్యాచరణపై కార్యశాల - జాతీయ మొక్కల ఆరోగ్య సంస్థచే శిక్షణ

జి ఐ సి ప్రాజెక్ట్‌లో భాగంగా మే నెలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు





పొలంబడి - టిటిడి కి కూరగాయల సరఫరాపై దేవస్థానం అధికారితో రైతు నేతల చర్చలు- ఎం టమాటో ఎఫ్ పి ఓ డైరెక్టర్ల సమావేశం

సంపాదకీయం



# నూతన ప్రస్థానం !

'ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఘట్టం ముగిసింది. మునుపెన్నడూ లేనంతటి భారీస్థాయిలో జరిగిన ఓటింగ్‌లో రాష్ట్ర ప్రజలు దాదాపు 50 శాతం ఓట్లతో, 151 సీట్లతో శ్రీ వై ఎస్ జగన్మోహన రెడ్డి గారి నాయకత్వంలోని వై.ఎస్.ఆర్.సి.పి. కి చరిత్రాత్మక అద్భుత విజయాన్ని అందించారు. పట్టుదలతో, ఓర్పుతో, నిరంతర కృషితో , రాజకీయ చాతుర్యంతో ప్రజల మనస్సులను గెలుచుకుని, ఒకనాటి పరాజయాన్ని ఘన విజయంగా మలచుకుని. పోరాట పటిమకు సంకేతంగా నిలిచి, నవ్యాంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ జగన్మోహన రెడ్డి గారికి 'ఏపిమాస్' హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నది. కొత్త నాయకుని నేతృత్వంలో మొదలైన నూతన ప్రస్థానంలో నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని, అనునిత్య అభ్యుదయ పథంలో అగ్రగామిగా నిలవాలని, ప్రజలందరూ శాంతి సంతోషాలతో జీవించాలని 'ఏపిమాస్' మన: పూర్వకంగా ఆకాంక్షిస్తున్నది, ప్రగాఢంగా విశ్వసిస్తున్నది. అఖండ విజయం సిద్ధించిన వెంటనే శ్రీ జగన్మోహన రెడ్డి గారి తొలి పలుకులు, వేసిన మొదటి అడుగులు ఈ విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి. ముఖ్యమంత్రిగా పాలన ప్రారంభించిన ఆరు నెలలు లేదా సంవత్సర కాలంలో తాను 'మంచి ముఖ్యమంత్రిగా' నిరూపించుకోవాలన్న ఆయన ఆకాంక్ష, తపన ఎంతైనా శ్లాఘించదగినది. 'ప్రారంభం మంచిదైతే సగం సాధించినట్టే' (ఎ గుడ్ బిగినింగ్ ఈజ్ హాఫ్ డన్) అనే సూక్తికి అనుగుణంగా ఉభయ తెలుగు రాష్ట్రాలు, ప్రజల మధ్య సుహృద్భావ, సత్సంబంధాలు పెంపొందడానికి దోహదకారిగా తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు గారికి ఆయన స్నేహ హస్తం చాచడం, శ్రీ చంద్రశేఖర రావు గారు కూడా అంతే సమాదరంతో సానుకూలంగా ప్రతిస్పందించడం ఒక శుభ పరిణామం. ఇక ఇంతటి విజయాన్ని చూసుకుని విర్రవీగకుండా కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు నెలకొల్పుకుంటే తప్ప రాష్ట్ర సత్వర సర్వతోముఖాభివృద్ధి సాధ్యం కాదన్న రాజకీయ సదవగాహనతో, వివేకంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారిని కలుసుకుని అభినందించడం, అండగా నిలుస్తామన్న హామీ పొందడం హర్షణీయం. సామాజిక సమస్యల పరిష్కారంలో ఏపిమాస్ వంటి అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు విశేషంగా కృషిచేస్తున్నాయి. శ్రీ జగన్మోహన రెడ్డి గారు ఈ ప్రభుత్వేతర సేవాసంస్థలను రాష్ట్రాభివృద్ధి కృషిలో భాగస్వాములను చేయగలిగితే రాష్ట్రాభివృద్ధి మరింత వేగవంతమవుతుంది.

జీవన వేదం

# జగత్ కల్యాణం!

'శుభం భూయాత్'! అంతా మంచే జరుగుగాక! ఇది పెద్దల దీవెన. భాష వేరు కావచ్చు, వ్యక్తీకరణలో తేడాలుండొచ్చు, కాని భావం మాత్రం అదే! మేలు చేకూరాలని. మేలు అంటే? ఎవరికి? మరి మిగిలినవారి సంగతేమిటి? ఒకరి మేలు మరొకరికి కీడు కావచ్చు కదా! ఇలా అనేక ప్రశ్నలు, సందేహాలు. నిజమే, సాపేక్ష సిద్ధాంతం (ది థియరీ ఆఫ్ రిలెటివిటీ) ప్రకారం ఏ గుణమూ పోల్చిచెప్పవలసిన అవసరం లేకుండా తనంత తాను సంపూర్ణం కాదు. మంచి అనగానే దేనికంటె మంచి అనే ప్రశ్న సిద్ధంగా వుంటుంది. చెడు అన్నా అంతే. అందుకే మంచి చెడు, మేలు కీడు, సుఖము దు:ఖము, తెలుపు నలుపు ఇలాంటి పదాలు జంటగా వుంటుంటాయి. ఈ భావాన్నే ఒక కవి 'ద్వంద్వముల లంకెల్‌గాక కలదే ఒక్క అఖండ భావమది లోకంబందు ఎందేనియున్' అని పేర్కొన్నాడు. 'కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం' అనే సామెత ఈ నిత్యసత్యాన్నే చాటడంలేదూ? కప్ప పాముకు ఆహారం. పాము కప్పను కబళిస్తుంటే జీవకారుణ్య దృష్టితో కప్పను తినవద్దంటే మరి పాము ఆకలి సంగతేమిటి? తినమంటే కప్పకు అది మరణశాసనమే కదా! ఇది ఒక ధర్మ విచికిత్స. సృష్టి స్వభావమే దీనికి సమాధానం. ఐతే, 'సమాజ హితం' అనే విస్తృత ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకున్న మన పెద్దలు, ఋషులు సర్వశ్రేయోదాయకంగా, జగత్కల్యాణ కారకంగా ఎన్నో ధర్మాలు ప్రబోధించారు, ఎంతగానో మార్గదర్శనం చేశారు. సమాజంలో సమానత్వం, సమరస భావం వెల్లి విరియాలని ఆకాంక్షించారు. క్రమక్రమంగా, నెమ్మది నెమ్మదిగానైనా ఏకరూపత, భావ సమైక్యత సాధించాలని వారు తపించారు. ఈ వేద మంత్రాన్ని చూడండి: 'సం గచ్ఛధ్వం సం వదధ్వం సం నో మనాంసి జానతాం' (కలసి అడుగేద్దాం, కలసి మాటాడుదాం, కలసి ఆలోచిద్దాం) ఎంతటి మనోహరమైన సందేశం! మరొక శ్లోకం సమాజంలోని మంచి చెడ్డల వాస్తవిక దుస్థితిని అర్థంచేసుకుంటూనే, చెడు క్రమక్రమంగా మంచిగా మారాలని, విశ్వమంతా అఖండ శ్రేయోరాజ్యంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించింది. 'దుర్మార్గులు సన్మార్గులుగా మారాలి, సజ్జనులకు శాంతి చేకూరాలి, శాంతి పొందినవారు అంతశ్శత్రువులైన అరిషడ్వర్గాలనుంచి విముక్తులు కావాలి, ఇలా విముక్తి పొందినవారు ఇతరులను మంచివారుగా మార్చాలి' అని ఆ శ్లోకం లోకకల్యాణ కాంక్షను చాటుతుంది. 'సర్వేషాం స్వస్తిర్భవతు సర్వేషాం శాంతిర్భవతు సర్వేషాం పూర్ణం భవతు సర్వేషాం మంగళం భవతు' అని మరో వేదవాక్కు ఇదే రీతిలో మానవ మహోన్నతిని ఆకాంక్షించింది.

*ఆసక్తికలిగినవారి కోసం ఆ శ్లోకం:*

**దుర్జన: సజ్జనో భూయాత్ సజ్జన: శాంతిమాప్నుయాత్**
**శాంతో ముచ్యేత బంధేభ్యో ముక్తశ్చాన్యాన్ విమోచయేత్**

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**

# లోపలి పేజీలలో ....

➪ తొలకరి వస్తోంది...సాగుకు సిద్ధమవుదాం! ...05
➪ టమోటా తెగుళ్ళ పై అంతర్జాతీయ సదస్సు ...11
➪ వ్యాపార మెలకువలతో రైతు సంఘాలు ...12
➪ గర్భిణులు, బాలింతల పోషకాహారంపై శిక్షణ ...13
➪ ప్రభుత్వ సేవలలో సమస్యలు... ...14
➪ 'అనంత' జీవనోపాధుల ప్రాజెక్టుల పై సమీక్ష ! ..15
➪ పోషణ, జెండర్అంశాలకు కార్యకర్తల ఎంపిక ...16
➪ రాజస్థాన్‌లో 'మాస్'చే సంఘాల ఆడిట్ ...17
➪ ధరణి ఎఫ్ పి ఓ మహాసభ ! ...18
➪ జీవశక్తిని పదింతలు చేసే గోధుమ గడ్డి రసం ...19
➪ మట్టి పాత్రలో వంట మధుమేహానికి విరుగుడు ! ...22
➪ కేన్స్‌లో సత్తాచాటిన 'మహిళా రైతు' లఘు చిత్రం!...24
➪ పురుగుమందుల వినియోగంలో జర భద్రం ! ...25
➪ సృష్టికర్తలు.... సాగు నేస్తాలు ...27
➪ స్కూటరే... కాడెడ్లు ...28
➪ 10 సం.లో రైతు సమస్యలకు పరిష్కారం ! ...29
➪ గ్రామీణ మౌలిక సదుపాయాలు, సేవలు ! ...30
➪ ప్లాస్టిక్ కాలుష్యాన్ని తుదముట్టించండి ...34

ఎడిటర్ : టి. చంద్రశేఖర రెడ్డి
అసోసియేట్ ఎడిటర్: జె.వి. క్రిష్ణమూర్తి

ఎడిటోరియల్ కమిటి:
ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి,
ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్
ఎన్. రమాదేవి

కన్సల్టెంట్ కె.రఘురామరాజు

గమనిక: 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆశావహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.

## మహిళా సాధికారత ప్రోత్సాహక చందా

| ఏడాదికి | రెండేళ్లకు | మూడేళ్లకు |
|---|---|---|
| రూ.110 | రూ.200 | రూ.280 |

## ప్రకటన ఛార్జీలు

| | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం): | రూ. 25,000 |
| మల్టీకలర్ బ్యాక్ పేజి (పూర్తి): | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి): | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి): | రూ. 10,000 |

➪ చందాలు లేదా ప్రకటనలకోసం పంపే చెక్కులను, డిడిలను 'ఏపిమాస్-హైదరాబాద్' పేరుమీద మాత్రమే పంపాలి

**మహిళా సాధికారత**
ఏపిమాస్ కార్యాలయం,
ప్లాట్ నెం.11-12, హుడా కాలని,
తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర,
మణికొండ, రంగారెడ్డి జిల్లా,
హైదరాబాదు-500089
ఫోన్స్ : 08413-403118/19/20
ఫాక్స్ : 08413-403117
Web:www.apmas.org
E Mail: info@apmas.org

పగ, ద్వేషం పతనం చేసే జాడ్యాలు, వాటిని వదిలించుకుంటే హృదయం ఎంతో నిర్మలం

# తొలకరి వస్తోంది...సాగుకు సిద్ధమవుదాం!

**జూ**న్ నెల వస్తున్నదంటేనే ఒకప్పుడు రైతుకు ఎంతో సంబరం. ఎందుకంటే తొలకరి మొదలవుతుంది. వానలు కురుస్తాయి. నాట్లు వేసుకోవడానికి రైతు సర్వసన్నద్ధంగా వుంటాడు. వేసవిలోనే పొలాలు దున్ని, పచ్చిరొట్ట ఎరువులు వేసి పొలాన్ని తొలకరికి స్వాగతం పలుకడానికి సిద్ధం చేస్తాడు. ఇప్పుడు పరిస్థితి మారింది. 'వాన రాకడ ప్రాణం పోకడ చెప్పలేం' అనేంతగా వానల జాడ ఊహాతీతంగా తయారైంది. వాతావరణ శాఖ అంచనాలుకూడా తప్పు తున్నాయి. వాన కురవడమే అరుదవుతున్నది. ఇక ఎప్పుడు కురిస్తే అప్పుడే సాగు మొదలెట్టాలి అనే పరిస్థితి.



అయినా సాంప్రదాయికంగా రైతులు తొలకరి నాటికి పంట పొలాలను సిద్ధం చేస్తూనే వున్నారు. వానలు కురవడం ఆలస్యం పొలాలలో అనువైన రకరకాల పంటలు వేయడానికి తమ వంతుగా అన్నీ సిద్ధం చేసుకునే వుంటున్నారు. రైతులకు మార్గదర్శకంగా ఈ నెలలో చేపట్ట వలసిన వ్యవసాయ పనుల గురించి వ్యవసాయ శాఖ వారు అందిస్తున్న వివరాలను తెలుసుకుందాం.

**వరి :**

నీటి వసతి ఉన్నచో సిఫారసు చేసిన దీర్ఘకాలిక, మధ్యకాలిక రకాలతో నార్లు పోయడం ఆరంభించాలి. స్వర్ణ, కృష్ణవేణి, చైతన్య ప్రతిభ తొలకరి బాపట్ల సన్నాలు. కృష్ణా, గోదావరి మండలానికి శ్రీకాకుళం సన్నాలు. స్వర్ణ, చైతన్య, వసుంధర, ఉత్తర కోస్తా మండలానికి విజేత, శివ, కేశవ, ఇందూరు సాంబ, ఎర్లీ సాంబ, ఎర్ర మల్లెలు, సత్య, సలీమ, దక్షిణ తెలంగాణ మండలానికి సాంబ మసూరి, దీప్తి, నంద్యాల సన్నాలు అల్పవర్ష ప్రాంత మండలానికి అనుకూలమైన రకాలు. కిలో విత్తనానికి రెండున్నర గ్రా. కార్బెండాజిమ్‌ను కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లాలి. దుంప నారుమళ్ళు అయితే లీటరు నీటికి 1 గ్రా. కార్బెండాజిమ్‌ను కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండె కట్టిన మొలకలను నారుమడిలో చల్లాలి.

- నీరు పెట్టడానికి , అదనపు నీరు బయటికి పోవుటకు అనువైన ప్రదేశాన్ని నారుమడి కోసం ఎంపిక చేసుకోవాలి.
- గడిచిన పంటకు భూమి ద్వారా ఆశించే తెగుళ్ళు ఎక్కువగా ఆశించినట్లయితే అటువంటి ప్రదేశాన్ని నారుమడి కోసం ఎంపిక చేయరాదు.
- నారు పోయుటకు ఉపయోగించే భూమిని 2-3 సార్లు బాగా దున్ని భూమి గుల్లబారే విధంగా తయారు చేసు కోవాలి. దీనివలన నీరు క్రింది పొరలకు త్వరగా ఇంకిపోకుండా ఉంటుంది. అంతేగాక నారుమడికి

అందించిన పోషకాలు కూడా క్రింది పొరలకు చేర కుండా నారు బాగా ఎదగడానికి ఉపయోగపడతాయి.

- నానబెట్టి మొలకెత్తించిన విత్తనాన్ని నారుమడిలో పోసుకోవాలి. సెంటుకు 5 కిలోల వంతున వాడాలి.
- ఐదు సెంట్ల నారుమడికి గాను 4.4 కిలోల యూరియా, 6.25 కిలోల సూపర్ ఫాస్ఫేట్ , 1.6 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరమవుతుంది.
- పంట భూమిని వేసవి సమయంలో 1-2 సార్లు దున్నినందువలన కలుపు నివారణ జరిగి తేమ ఎక్కువ కాలం నిలబడుతుంది.
- నారు పోసిన 2-3 రోజులకు బెంథియోకార్బ్ 75 మి.లీ. లేదా ప్రొపానిల్ 60 మి.లీ లేదా బ్యూటాక్లోర్ 85 మి.లీ ఏదో ఒక మందు 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వేసవిలో ప్రధాన పొలం లోతు దుక్కి చేయుట వలన భూమిలోను, పంట మోళ్ళలోను దాగివున్న కీటకాలు కోశస్థ దశలు , శిలీంధ్ర బీజాలు నిర్మూలించ బడతాయి. పొలం లోపల , గట్లపై కలుపు లేకుండా నివారించాలి.
- నారుమడిలో వచ్చు కాండం తొలుచు పురుగు, తాటాకు తెగులు , తామరపురుగుల నివారణకు కోసం విత్తిన 7-10 రోజులలో సెంటుకు 160 గ్రాముల వంతున కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోరిఫైరిపాస్ 2.5 మి.లీ లేదా క్వినాల్ఫాస్ 2.0 మి.లీ ఒక లీటరు నీటికి ఏదో ఒక మందు కలిపి పిచికారి చేయాలి.
- నారు తీతకు వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల వంతున కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి వేయాలి.
- పొడ తెగులు , కాండం కుళ్ళు తెగులు లక్షణాలు కనిపించినపుడు హెక్సాకొనజోల్ 2.0 మి.లీ లేదా వాలిడామైసిన్ 2.0 మి.లీ. ఒక లీటరు నీటికి ఏదో ఒక మందు కలిపి పిచికారీ చేయాలి.

**జొన్న :** వర్షాలు కురియగానే తేలిక నేలలో పైరు విత్తడం ఆరంభించి వీలైనంత తొందరగా పూర్తి చేయాలి. పశువుల ఎరువులు ఎకరాకు నాలుగు టన్నులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. వర్షాధార పంటకు ఎకరాకు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరము, 12 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను విత్తేముందు వేయాలి. పైరు మోకాలు ఎత్తు దశలో ఉన్నప్పుడు 12 కిలోల నత్రజనిని పై పాటుగా తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి. జొన్న + కంది అంతరపంటగా 2:1 నిష్పత్తిగా వేసిన అధిక లాభం పొందవచ్చును.

**సజ్జ :** విత్తుకోవడానికి డబ్ల్యు.సి.సి.75, ఐసిటిపి 203, ఐసిఎంవి 221, ఐసిఎంహెచ్ 360 రకాలు మేలైనవి. వర్షాధార పంట క్రింద ఎకరాకు 12 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరము, 8 కిలోల పొటాష్ ఆఖరి దుక్కిలో విత్తేముందు వేయాలి. పైరు మోకాలు ఎత్తు వరకు ఉన్నపుడు పైపాటుగా మరో 12 కిలోల నత్రజనిని వేయాలి.

**మొక్కజొన్న :** ఎకరాకు 36 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరము, 16 కిలోల పొటాష్ నిచ్చు ఎరువులను వేయాలి. నత్రజని ఎరువులను 3 సమభాగాలుగా చేసి విత్తేటప్పుడు, పైరు మోకాలి ఎత్తు ఉన్నపుడు (30-35), సుంకు పోసేటప్పుడు (50-55 రోజులు) వేయాలి. కలుపు నివారణకు విత్తిన వెంటనే అట్రాజిన్ మందును ఎకరాకు 0.8 కిలోలు / 200 లీటరు నీటిలో (4 గ్రా / లీటరు నీటికి) కలిపి పిచికారి చేయాలి.

**పెసర :** తొలకరి పంటగా పి.యన్ - 16, యం.ఎల్ - 267, పూసా 105, యల్.జి.జి.407, 410, 450, 460, డబ్ల్యుజిజి, యంజిజి 295, 348 రకాలతో సాగు చేసుకోవచ్చును. విత్తునపుడు ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరము నిచ్చు ఎరువులను వేయాలి.

**మినుము :** టి-9, యల్.బి.జి-20, 623, డబ్ల్యు.బి.జి-26, పిబిజి-1 రకాల సాగుకు అనుకూలము. పెసర పైరులో సూచించిన మేరకు ఎరువులు వాడుకోవాలి. అంతర కృషి చేయాలి.

దారి లేదని నిరాశ చెందకు, మూసుకుపోయినట్లు కనిపించేదారి ఒక మేలు మలుపు కావచ్చు

**సోయా చిక్కుడు :** హార్డీ ఎమ్.ఎ.సి.ఎస్-13, జె.ఎస్ - 335, పి.కె. 472, 1029 రకాలు అనుకూలము. విత్తనాన్ని రైజోబియం కల్చరు (2.5 గ్రా / కిలో విత్తనానికి) తో శుద్ధి చేసి విత్తాలి. విత్తునపుడు ఎకరానికి 12 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ నిచ్చు ఎరువులు వాడాలి.

**నువ్వులు :** తొలి వర్షాలతో గౌరి, రాజేశ్వరి, మాధవి, వై.ఎల్.ఎం.11, 17, శ్వేత, చందన రకాలను సాగు చేసుకోవాలి. ఎకరాకు 16 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరము, 16 కిలోల పొటాష్ నిచ్చు ఎరువులు వేయాలి. భాస్వరం, పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. నత్రజని ఎరువులను రెండు సమ భాగాలుగా చేసి విత్తేటప్పుడు మరియు 30 రోజులకు వేయాలి.

**ప్రత్తి :** తేలిక నేలలో మంచి వర్షం కురియగానే విత్తుకోవచ్చును. ఈ మధ్యకాలంలో శనగపచ్చ పురుగు,



ప్రత్తి పంటకు నష్టాన్ని కలుగచేయుచున్నది. సమగ్ర సస్యరక్షణ చర్యలు వీటి నివారణకు ఆవశ్యకము.

**కంది :** సాధారణంగా కందిని జొన్నతో, మొక్కజొన్నతో, వేరుశనగతో అంతరపంటగా సాగు చేస్తారు. పల్నాడు, మారుతి, అభయ, ఆశ, యల్.ఆర్.జి-41, లక్ష్మి రకాలు అంతర పంట విధానమునకు అనుకూలము.

**ఆముదము :** మంచి వర్షాలు కురిసిన తర్వాత దుక్కి తయారుచేసి క్రాంతి, జ్యోతి, హరిత రకాలలో ఏదో ఒక దానికి లేదా జి.సి.హెచ్ 4 సంకర రకమును సాగు చేయాలి. ఎండు తెగులు నివారణకు జి.సి.హెచ్ 4 సంకర రకమును సాగుచేయాలి. ఎండు తెగులు నివారణకు జి.సి.హెచ్ 4 (సంకర రకము), హరిత రకము సేకరించుకోవాలి. చివరి వారంనుండి విత్తడం కూడా ఆరంభించవచ్చును.

**గోగ :** అంతర కృషి, రసాయనిక ఎరువులు వేయుట.

**చెరకు :** ఉత్తర కోస్తా జిల్లాల్లో పైరుకు రెండవ దఫా నత్రజని హెక్టారుకు 65 కి. నాటిన 90 రోజులకు, కోస్తా జిల్లాల్లో రెండవ దఫా నత్రజని ఎరువు హెక్టారుకు 80 కిలోలు నాటిన 90 రోజులకు, రాయలసీమ జిల్లాల్లో నాటిన 120 రోజులకు 125 కి. నత్రజనిని వేయాలి. కలుపు తీసిన బోదెలకు మట్టి ఎగతోయాలి.

**వేరుశనగ**

- ఏప్రిల్ - మే నెలల్లో వేసవి దుక్కులు చేసుకొని రైతులు తక్షణం లోతుగా దుక్కి చేసుకోవాలి. దీనివల్ల పంటను నష్టపరిచే పురుగుల, తెగుళ్ళ ఉధృతిని తగ్గించుకోవచ్చు.



- ఉత్తర కోస్తా మరియు ఉత్తర తెలంగాణ ప్రాంతంలో జూన్- జులై మాసాలలో అలాగే దక్షిణ తెలంగాణ మరియు రాయలసీమ ప్రాంతంలో జులై నుండి ఆగస్టు మొదటివారం వరకు వేరుశనగను విత్తుకోవడానికి సరియైన అదును.
- వేరుశనగ పంటకు సారవంతమైన, నీరు ఇంకిపోవు తేలికపాటి లేదా ఇసుకతో కూడుకున్న ఎర్రగరప నేలలు శ్రేష్ఠం.ఎట్టి పరిస్థితులలోను, నల్లరేగడినేల ఎక్కువ బంక మట్టి గల నేలలను ఎంచుకోరాదు. విత్తుకొనే ముందు భూమిని మొత్తం దుక్కి చేసుకొని, చదును చేసుకోవాలి.

**జీవితం ఒక అద్భుతమైన వరం, పనికి మాలిన ఆలోచనలతో దానిని వ్యర్థం చేసుకోకు**

- తక్కువ వర్షపాతం వచ్చే ప్రాంతాలలో పూర్తిగా వర్షాధారంగా వేరుశనగ పండించదలచుకుంటే బెట్టను తట్టుకొని తక్కువ కాలంలో పండే రకాలైన కదిరి-6, కదిరి-7, నారాయణి, వేమన, జె.సి.జి-86, అభయ, ఐ.సి.జి.వి. 9114 లాంటి రకాలను ఎంచుకోవడం మంచిది. అలాగే కొద్దిపాటి నీటి వసతి ఉంటే వేమన, కదిరి-6, నారాయణి, గ్రీష్మ లాంటి రకాలు పండించవచ్చు. అధిక వర్షపాతం గల ప్రాంత రైతులు కదిరి-3, టి.జి.26, టిఏజి-24, అభయ, గ్రీష్మ లాంటి రకాలు ఎంచుకోవచ్చును. ముడత లేని చిన్న చిన్న గింజలను కూడా విత్తనానికి వాడుకోవచ్చు.
- పేరెన్నిక గల సంస్థల నుండి నాణ్యమైన విత్తనాన్ని సేకరించుకోవాలి. విత్తనం జన్యు స్వచ్ఛత కల్గి, కనీసం 85 శాతం మొలకెత్తే గుణం కల్గి ఉండాలి.
- విత్తన పరిమాణం, బరువు, మొలకశాతం పైన విత్తిన మోతాదు ఆధారపడుతుంది. కదిరి-6, తిరుపతి-4, నారాయణి, అభయ, గ్రీష్మ లాంటి రకాలకు ఎకరాకు 60 కిలోల విత్తనం కావాలి. అలాగే కదిరి-9, జెపిజి-88, టిజి-26, టిఏజి-24 లాంటి రకాలకు ఎకరాకు 50 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తేముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. ఎక్కడైతే వేరుపురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందో ఆ ప్రాంతాలలో ఒక కిలో విత్తనానికి 6 మి.లీ. క్లోరిఫైరిఫాస్‌తో మొదట విత్తనశుద్ధి చేసి ఆరిన తర్వాత మాంకోజెబ్ పొడి మందును 3 గ్రాముల చొప్పున కలుపుకోవాలి. అలాగే వైరస్ ద్వారా వచ్చే మొవ్వ కుళ్ళు మరియు కాండంకుళ్ళు ఎక్కువగా వచ్చే ప్రాంతాలలో కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్రోప్రిడ్ మందును కలిపి శుద్ధి చేసి ఆ తరువాత మాంకోజెబ్ 3 గ్రా. చొప్పున కలుపుకోవాలి.
- విత్తేటప్పుడు చిన్నగుత్తి రకాలకు సాలుకు సాలుకు మధ్య 30 సెం.మీ సాలులో మొక్కల మధ్య 10 సెం.మీ ఉండేట్లు విత్తుకోవాలి. విత్తుకోవడానికి ఎద్దులతో గాని లేదా ట్రాక్టరుతో నడిచే సీడ్‌కమ్ ఫెర్టిడ్రిల్ పరికరాన్ని వాడుకోవచ్చు. అంతర పంటలుగా వేరుశనగ + కంది 7:1 (లేక) 11:1 నిష్పత్తిలో విత్తుకోవాలి.
- భూసార పరీక్షఫలితాలను పరిగణనలోకి తీసుకొని ఎరువుల మోతాదు నిర్ణయించుకోవాలి. సాధారణంగా ఖరీఫ్‌లో వేరుశనగ పంటకు ఎకరాకు 17-18 కిలోల యూరియా, 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 35 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను విత్తేముందు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. జింకు లోపమున్న పొలాలకు ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్ వేసుకోవాలి. ఊడ దిగే సమయంలో జిప్సం ఎకరానికి 200 కిలోల చొప్పున భూమి లోపల వేసి కలియబెట్టాలి.
- విత్తనం వేసిన వెంటనేగాని లేదా 3 రోజులలోపు పెండి మిథాలి, కలుపునాశిని మందును ఎకరాకు 1 లీటరు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసినట్ల యితే కలుపును సమర్ధవంతంగా నివారించుకోవచ్చు.
- జూన్‌లో విత్తిన వేరుశనగలో 25-30 రోజుల మధ్య అంతర కృషి చేసుకోవాలి. దీనికి గొర్రుగాని, దంతులు గాని, మెట్ల గుంటక లేదా రెక్కల గుంటకలను వాడు కొంటే ఖర్చు బాగా తగ్గుతుంది. అలాగే రసం పీల్చే పురుగుల తాకిడిని గమనించి అవసరమైతే మనోక్రోటో ఫాస్ 1.6 మి.లీ + వేపనూనె 5 మి.లీ + సబ్బుపొడి 5 గ్రాములు ఒక లీటరు నీటికి చొప్పున ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలి.

**పండ్ల తోటలు**

- అరటిలో వైరస్ తెగులు సోకని ఆరోగ్యవంతమైన తోటల నుండి సేకరించిన పిలకలపై చర్మం పలుచగా చెక్కి 2.5 మి.లీ మోనోక్రోటోఫాస్ మరియు 5 గ్రా కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపిన మందు ద్రావణంలో 10-15 నిమిషములు శుద్ధిచేసి నీడలో ఆరబెట్టి నాటు కోవాలి. పిలకలు లేదా టిష్యూకల్చర్ మొక్కలు నాటే సమయంలో నేలద్వారా ఆశించే దుంప

కుళ్ళు తెగులు నివారణకు ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనాస్ ఫ్లోరసెన్సు లను ముందుగా పశువుల ఎరువులో వృద్ధి చేసి మొక్కలు చుట్టూ వేయాలి. ఇదేవిధంగా 3-4 నెలలకు ఒకసారి వేసి తెగులును అదుపు చేయవచ్చును.

- సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణకు 1మి.లీ. ప్రొపికొనజోల్, 0.5 మి.లీ. జిగురును లీటరు నీటికికలిపి ఆకులు పూర్తిగా తడిచేలా పిచికారి చేయాలి.
- చీని, నిమ్మచెట్లకు సిఫారసు చేసిన ఎరువులు వేయాలి. తోటలో జనుము వంటి పచ్చిరొట్ట పంటలను విత్తాలి.



కాపు కొచ్చిన చెట్టు ఒక్కంటికి 20 కిలోల పశువుల ఎరువు, 4 కిలోల వేపపిండి, 800 గ్రా. యూరియా, 1 కిలో సింగిల్ సూపర్ పాస్ఫేట్ మరియు 375 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నీటి తడులు ఇవ్వాలి. కొత్త చిగురును ఆశించు పేనుబంక, నల్లదోమ, ఆకుముడత వంటి పురుగులను నివారించుకోవాలి. గజ్జి తెగులు నివారణకు 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ మరియు 1. గ్రా స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటికి కలిపి 20 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.

- చీని, నిమ్మతోటల్లో కొత్త చిగురుపై సూక్ష్మపోషకాలు పిచికారి చేయాలి. వేరుకుళ్ళు నివారణకు చెట్ల పాదు లను 1శాతం బోర్డో మిశ్రమం ద్రావణంతో తడపాలి.
- ద్రాక్ష తోటలపై 500 పి.పి.యం. సైకోసిల్ ద్రావణాన్ని పిచికారి చేయాలి. మజ్జిగ తెగులు నివారణకు 1 శాతం బోర్డోమిశ్రమం లేదా లీటరు నీటికి 2 గ్రా. మెటలాక్సిల్ లేదా 2.5గ్రా మాంకోజెబ్, పక్షికన్ను తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా ప్రొపినేబ్ లేదా 2 గ్రా కాపర్ హైడ్రాక్సైడ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పెంకు పురుగు నివారణకు 3 గ్రా. కార్బరిల్ పొడి మందు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- చీడపీడల ఉనికిని గమనించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- దానిమ్మలో కత్తిరింపులు చేసి 1 శాతం బోర్డో మిశ్రమం పిచికారి చేయాలి.
- దానిమ్మ తోటలకు, రేగు, ఉసిరికి సిఫారసు చేయబడిన



ఎరువులు వేయాలి.

- రేగులో లేత చిగురులను ఆశించు పురుగులనివారణకు 2మిలీ ఎండోసల్ఫాన్ లీ. నీటికికలిపి పిచికారి చేయాలి.
- జామ చెట్టు ఒక్కంటికి 60 కిలోల పశువుల ఎరువు, 1 కిలో యూరియా, 1.2 కిలోల సూపర్ ఫాస్పేట్, 750 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి.
- బొప్పాయిని ఆశించు మొజాయిక్, ఆకుముడత, ఉంగరాల మచ్చ తెగుళ్ళను వ్యాప్తి చేసే రసం పీల్చు పురుగుల నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాస్ లేదా ఫ్రిఫోనిల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- కాపుకొచ్చిన ప్రతి సీతాఫలం చెట్టుకు 50 కిలోల పశు వుల ఎరువు, 1 కిలో ఆముదం పిండి లేదా వేపపిండి, 500 గ్రా యూరియా, 125 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్పేట్, 200 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.

**ఎంతటి మహా ప్రవాహమైనా చిన్న నీటి ధారగానే మొదలవుతుంది**

- కాపుకు వచ్చిన, సపోటా చెట్టు ఒక్కొంటికి 50 కిలోల పశువుల ఎరువు, 400 గ్రా, యూరియా, 500 గ్రా. సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, 350 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.

**కూరగాయ పంటలు**

- బెండ, గోరుచిక్కుడు, పొదచిక్కుడు, తీగచిక్కుడు, బొబ్బర్లు, కాకర, బీర, దోస, పొట్ల, సొర (ఆనప), గుమ్మడి మరియు బూడిత గుమ్మడి పంటలను నేరుగా ప్రధాన పొలంలో విత్తుకోవాలి.
- ఆకుకూర పంటలను చిన్న చిన్న మడులలో నేరుగా విత్తుకొని 25 రోజుల వయస్సులో కోసుకోవాలి.
- టొమాటో, వంగ మరియు మిరప పంటల నారును ఎత్తయిన నారమడులలో పెంచాలి. కిలో విత్తనానికి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ , 5 గ్రా. ట్రైకో డెర్మావిరిడితో విత్తనశుద్ధి చేయాలి. నారుకుళ్ళు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్, లీటరు నీటికి కలిపి నారుమళ్ళను తడపాలి. నారుమళ్ళలో రసం పీల్చే పురుగుల నివారణకు 1 సెంటు నారుమడికి 100 గ్రా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను వేసుకోవాలి. ప్రధాన పొలంలో అక్కడక్కడ బంతి మొక్కలు పెంచి నులి పురుగులు ఆశించకుండా కాపాడుకోవచ్చును.





- క్యాబేజీ, కాలీఫ్లవర్ (స్వల్పకాలిక రకాలు) నారును ఎత్తైన నారుమళ్ళపై పెంచాలి.
- టొమాటో, మిరప, వంగ మరియు ఉల్లి నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి. పంట నాశించే రసం పీల్చే పురుగుల నివారణకు 0.5 శాతం వేపనూనె లేదా 5 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలి. భూమిద్వారా వ్యాప్తిచెందే నారుకుళ్ళు, కాండంకుళ్ళు, ఎండు, వడలు తెగుళ్ళ నివారణకు లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి మొదళ్ళ వద్ద ముంపుగా తడపాలి. నులి పురుగుల నివారణకు ఎకరానికి 8కిలోల కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను దుక్కిలో వేయాలి. వైరస్ తెగులు ఆశించకుండా కూరగాయ పంటలకు అంతర్వాహిక కీటకనాశిని మందులను పిచికారి చేయాలి. మిరప పంటను ఆశించే చెదపురుగుల నివారణకు 10 శాతం ఫాలిడాల్ పొడి మందును ఎకరానికి 20-25 కిలోల చొప్పున భూమిపై చల్లాలి.
- పాలిథీన్ సంచుల్లో పెంచిన మునగ నారును ప్రధాన పొలంలో నాటి ఊతమివ్వాలి.
- వర్షాభావ పరిస్థితులలో కంద, చేమ పైరులలో కనిపించే జింకు, ఇనుము, మెగ్నీషియం, ధాతులోప నివారణకు 20 గ్రా, జింక్‌సల్ఫేట్ 30 గ్రా, అన్నభేది, 30 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ , 15 గ్రా. నిమ్మ ఉప్పును 10 లీటర్ల నీటికి కలిపి 10-15 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.
- ఏకవార్షిక మునగ నారును పాలిథీన్ సంచులలో పెంచుకోవాలి.

**పూల తోటలు**

- వేర్లు తొడిగిన చామంతి కత్తిరింపులను 1 గ్రా. కార్బండజిమ్ లీటరు నీటికి కలిపిన మందు ద్రావణంలో శుద్ధి చేసి మడులలో నాటుకోవచ్చు.
- వర్షాకాలపు బంతి పంటకు నారు పోసుకోవాలి. ■

నీ జీవితం సార్థకం కావాలంటే, బతికే ప్రతి రోజూ ఏదో ఒక మంచిపని చెయ్

# టమోటా తెగుళ్ళ పై అంతర్జాతీయ సదస్సు

–జగన్‌మోహన్ రెడ్డి

ప్రపంచ కూరగాయల సంస్థ, జాతీయ చెంగ్ హ్సింగ్ విశ్వవిద్యాలయం,– ట్రైచుంగ్, తైవాన్ వ్యవసాయ పరిశోధన సంస్థ సంయుక్తంగా తైవాన్‌లో 2019 మే 6 నుండి 9 వ తేదీ వరకు టమోటా తెగుళ్ళ మీద 4వ అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. 20 దేశాల నుంచి టమోటా తెగుళ్ళ శాస్త్రవేతలు పాల్గొన్న ఈ సదస్సులో 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్) నుంచి టమోటా పంట నిపుణుడు శ్రీ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు. నాల్గురోజుల కార్యక్రమంలో మొదటి



మూడురోజులపాటు టమోటాలో ఆకు మాడు తెగుళ్ళు, బాక్టీరియా తెగుళ్ళు; తెల్ల దోమ, తామర పురుగు ద్వారా సంక్రమించే వైరస్ తెగుళ్ళను నూతన జినోమిక్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిర్మూలించే ఆధునిక ట్రాన్స్జెనిక్ ప్రయోగాలను గురించి వివరించారు.

చివరి రోజున సదస్సు ప్రతినిధులు తైవాన్‌లోని ప్రపంచ కూరగాయల సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ప్రపంచంలోని అన్ని రకాల కూరగాయల విత్తనాల జెర్మాప్లాజంలను ఇక్కడ శీతలీకరణ పద్ధతి ద్వారా సంరక్షిస్తున్నారు. విత్తన కంపెనీల, జాతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రాల కూరగాయల బ్రీడింగ్ కార్యక్రమాలకు ఈ కూరగాయల విత్తనాల జెర్మాప్లాజం ఉపయోగపడుతుంది. టమోటా గ్రాఫ్టింగ్ నర్సరీని, చెర్రీ టమాటో పాలీ హౌస్‌ను కూడా సందర్శించడం జరిగింది.

**టమోటాల ప్రాసెసింగ్‌పై జి. ఐ. జడ్ వర్క్‌షాప్**

చిత్తూరు జిల్లా రామసముద్రంలో మే 3వ తేదిన జి.ఐ.జెడ్ సంస్థ 'ప్రాసెసింగ్ టమోటాలు – క్షేత్ర స్థాయి అనుభవాలు' అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించింది. 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్) నుంచి సి ఇ ఓ, ఎం డి శ్రీ సి.ఎస్.రెడ్డి, మధు మంజరి, జగన్ మోహన్ రెడ్డి ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

రామసముద్రంలో ఏడుగురు రైతులు ఆర్బి సీడ్ కంపెనీ వారి ప్రాసెసింగ్ టమోటాలను (1822 రకం) ఏడు ఎకరాలలో సాగు చేశారు. ప్రాసెసింగ్ టమోటాలను రామసముద్రం మండలంలో రైతులతో సాగుచేయడానికి నవంబర్ నెల నుండి మార్చి నెల వరకు జి.ఐ.జెడ్, ఆర్బి సీడ్ కంపెనీ, సున్సిప్ టమోటా ప్రాసెసింగ్ కంపెనీ, మాస్ కలసి పని చేశాయి. 12.2 టన్నుల టమోటాలను రామసముద్రానికి 35 కిలో మీటర్ల దూరంలో శ్రీనివాసపురంలోవున్న సున్సిప్ కంపెనీకి ప్రాసెసింగ్ కొరకు పంపించారు. సున్సిప్ కంపెనీ వారు టమోటాలను ప్రాసెసింగ్ చేసి టమోటా క్రష్‌ను తయారు చేశారు.



ఈ వర్క్‌షాప్‌నందు ప్రాసెసింగ్ టమోటా సాగు, ప్రాసెసింగ్ క్షేత్ర స్థాయి అనుభవాలను పంచుకొన్నారు. కర్ణాటకలో, ఆంధ్రప్రదేశ్‌లో నేర్చుకున్న అనుభవాల ఆధారంగాం రాబోయే రబీ కాలంలో టమాటో ప్రాసెసింగ్ చేయడానికి అవసరమైన ప్రణాళికను సిద్ధంచేశారు. ■

పరోపకారాన్ని మించిన ఆనందం ఇంకేదీ వుండదు

# వ్యాపార మెలకువలతో రైతు సంఘాల సుస్థిరత !

– గోపాలరాజు

**ఆం**ధ్ర ప్రదేశ్ కరవు సంసిద్ధతా కార్యక్రమంలో (పల్లె జీవం) భాగంగా రాష్ట్రంలో 105 రైతు సంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది. రైతులకు వివిధ రకాలుగా సహకరించ డానికి పల్లెజీవం ద్వారా పలు కార్యక్రమాలను చేబట్టడం జరిగింది. అందులో భాగంగా రైతుసేవా కేంద్రం, వాతా వరణ సమాచార కేంద్రం, జీవ ఎరువుల వనరుల కేంద్రం, లైబ్రరీ వంటి సంస్థలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇంకా జీవనేల, కోళ్ళ పెంపకం యూనిట్ల ఏర్పాటు వంటి కార్య క్రమాలను రైతు సహకార సంఘాల ద్వారా చేపట్టడం జరుగు తున్నది. అనంతపురం జిల్లా రొళ్ళ క్లస్టర్ పరిధిలో మహిళాభి



వృద్ధి సొసైటీ (మాస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్య క్రమాల పనితీరు గురించి, రైతు సంఘాలను, అవి చేపట్టిన కార్యక్రమాలను గురించి తెలుసుకోవడానికి మాస్ సి ఇ ఓ, మేనేజింగ్ డైరెక్టరు శ్రీ సిఎస్ రెడ్డి ఇటీవల ఈ ప్రాంతాన్ని సందర్శించారు. మొదటగా అనంతపురం జిల్లా గుడిబండ మండలంలో ఏర్పాటు చేసిన శ్రీ సిద్ధేశ్వర వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం పాలక వర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో శ్రీ సి ఎస్ రెడ్డి ప్రసంగిస్తూ, రైతు సహకార సంఘాలు ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు, ముఖ్యంగా ఏ ఉద్దేశంతో సహకార సంఘాలను ఏర్పాటు చేసుకున్నారో ఆ లక్ష్యాలపై దృష్టిపెట్టి సభ్యులకు నాణ్యమైన సేవలు అందించాలని, నిర్మాణాత్మక మైన వ్యాపార ప్రణాళికలు చేసుకొని వాటిని అమలు చేయడం ద్వారా సుస్థిరమైన అభివృద్ధి సాధించాలని అన్నారు. చట్టబద్ధ మైన బాధ్యతలను సకాలంలో నిర్వహించి ప్రభుత్వ సంస్థలతో, ప్రభుత్వేతర తగిన సంస్థలతో అనుసంధానం ఏర్పాటు చేసుకొని వాటి తోడ్పాటుతో సభ్యులకు మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఎప్పటికప్పుడు స్వయం మదింపు వేసుకొని అబివృద్ధి దిశగా రైతు సహకార సంఘాలు పయనించాలనీాయన పాలక వర్గ సభ్యులను కోరారు.

## క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్

నేడు వ్యవసాయరంగం వివిధ కారణాలతో సంక్షోభం లో ఉంది. అందులో ప్రధాన కారణం వాతావరణ ప్రభావం. మనం చేసే వ్యవసాయం వాతావరణంలో సానుకూల మార్పులు తీసుకొచ్చే పద్ధతులతో వ్యవసాయం చేయాలి. ఇందుకోసం 'క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్' పేరుతో మహిళాభి వృద్ధి సొసైటీ (మాస్) ఈప్రాంతంలో ఒక కొత్త ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టు ద్వారా రైతులు రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేయడానికి కావలసిన సాంకేతిక సలహాలు, వనరులను అందిస్తుంది. అలాగే మట్టిలో పోషకాలను పెంచడానికి కావలసిన వ్యవసాయ పద్ధతులను, గ్రామీణ ప్రాంతంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి, వేడిని తగ్గించడానికి అవకాశం ఉన్నచోట 'క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్' ను అమలు జరుపుతామని, గుడిబండ మండలంలో రైతు సంఘాలు, గ్రామ పంచాయతీలు, మహిళా గ్రామైక్య సంఘాలతో కలసి ప్రాజెక్టు పని చేస్తుందని శ్రీ సిఎస్ రెడ్డి తెలిపారు.

అగలి మండలంలో శ్రీ ఆంజనేయ రైతు సహకార సంఘం తరఫున జీవఎరువులవనరుల కేంద్రం నిర్వాహకులు శ్రీ నరసారెడ్డి పొలంలో ఆయన చేపట్టిన సేంద్రియ వ్యవ సాయ పద్ధతులను శ్రీ సిఎస్ రెడ్డి సందర్శించారు. క్షేత్ర సందర్శనాంతరం ప్రాజెక్టు సిబ్బందితో, రైతుసంఘం బోర్డు సభ్యులతో చర్చిస్తూ మనమందరం కలసికట్టుగా రైతు శ్రేయస్సు కోసం సరికొత్త పద్ధతులలో పని చేయవలసిన అవసరం ఉందని, రైతు సంఘాలు స్వయం నిర్వహణతో సంఘాలను నడుపుకోవాలని శ్రీ సి ఎస్ రెడ్డి కోరారు. ■

గెలుపుబాట నిటారుగా ఎక్కవలసిన కొండలాంటిది, తక్షణమే గమ్యం రాలేదని ఆరాటపడకు

# గర్భిణులు, బాలింతల పోషకాహారంపై శిక్షణ

గర్భిణులు, బాలింతల పోషణ , ఆరోగ్య అంశాలు, జెండర్ ప్రభావం పై తిరుపతిలో, హైదరాబాద్‌లో ఆరోగ్య కార్యకర్తలకు ఏప్రిల్ నెలలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలను మహిళాభివృద్ధి సొసైటీ నిర్వహించింది.



ప్రస్తుతం సమాజంలో ఉన్న లింగపరమైన అసమానతల వలన గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్న పిల్లలు తగినంత పౌష్టికాహారాన్ని పొందలేక పోతున్నారు. అందువలన వారు రక్త హీనత, పోషణలోపం వంటి ఆరోగ్య సమస్యలకు గురిఅవుతున్నారు కనుక సభ్యులకు జెండర్‌పై అవగాహన కల్పిస్తూ, క్షేత్రస్థాయిలో జెండర్ పరమైన అడ్డంకులు తొలగించుకొని గర్భిణీ దశలో, బాలింత దశలలో ఆహార వైవిధ్యం పాటించవలసిన ఆవశ్యకత గురించి, ఆ పోషకాహార మెళుకువలను గురించి 'పాల్గొనడం ద్వారా నేర్చుకోవడం' పద్ధతుల ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.



స్త్రీలకు తగిన నిర్ణయాధికారం లేకపోవటం, తనకు అవసరమైన వాటిని అడగలేకపోవటం, పొందలేకపోవటం అనే కారణాల వలన కేవలం కొన్ని రకాల ఆహార పదార్థాలను తక్కువ పరిమాణంలో తినగలుగుతుంది. ఒక గర్భిణీ లేదా బాలింత తన ఆరోగ్యం తన చేతిలోనే ఉందని, తగినంత నాణ్యత గల ఆహారాన్ని పొందటం తన హక్కు అని గ్రహించి సమయానికి మంచి పౌష్టికాహారాన్ని తినాలి. కుటుంబ సభ్యులు కూడా అందుకు సహకరించాలి.

స్లమ్ సమాఖ్యలు ఆరోగ్య, పోషణ సేవలలో ఉన్న లోటుపాట్లను సవరించటమే కాకుండా, తమ వాడలో ఉన్న గర్భిణులు, బాలింతలు సరైన ఆహారాన్ని కుటుంబంలో పొందేలా కుటుంబ సభ్యులతో అవసరమైనప్పుడు చర్చించి అవగాహన కల్పించాలి.



ఈకార్యక్రమంలో అవగాన కల్పించడానికి హాజరైన మహిళా అభివృద్ధి సొసైటీ సిఈఓ, ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిటిలో పని చేసే కార్యకర్తలు కమ్యూనిటి అభిప్రాయాలను గౌరవిస్తూ, వారు చేస్తున్న పనులను ప్రోత్సహించి అభినందించాలి" అని తెలిపారు.

అదే విధంగా చిన్న చిన్న ఉదాహరణతో వారికి అర్థమయ్యే విధంగా వివరించాలి అని, పరిస్థితులను అంచనా వేసుకుని జెండర్ పరమైన అడ్డంకులను తొలగించుకొని గర్భిణీ, బాలింతలు ఆహార వైవిధ్యతను పాటించేలా చేయాలని ఆయన సూచించారు. ■

ఓడినా మళ్ళీ గెలవ వచ్చు, కానీ సాకులు వెదకడం మొదలెట్టావా ఇక శాశ్వత ఓటమే

# ప్రభుత్వ సేవలలో సమస్యలు...అధిగమించే మార్గాలు

హైదరాబాద్ నగర స్థాయి సహ భాగస్వాములతో సంప్రదింపుల సమావేశం గన్ ఫౌండ్రిలోని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ సమావేశ మందిరంలో ఇటీవల జరిగింది.



ఈ సమావేశంలో ఐసిడిఎస్ సీడీపీఓ శ్రీమతి జోత్స్న, ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అనూరాధ, (ఆజంపురా) శ్రీమతి వీణ (శాలివాహన నగర్), డాక్టర్ దీన్‌దయాల్ (మలక్‌పేట్), యుసిడి నుండి సిఓ లు, సమాఖ్య ప్రతినిధులు, మహిళా అభివృద్ధి సొసైటీ నుండి కన్సల్టెంట్ శ్రీమతి కళామణి, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి పద్మావతి పాల్గొనడం జరిగింది.



ఈ సమావేశంలో మాతా శిశు ఆరోగ్యం, పౌష్టికాహారం, లింగ వివక్ష పై చర్చ జరిగింది.

ముఖ్యంగా ప్రభుత్వం అందించేసేవలలో ఏర్పడిన అవాంతరాలను స్లమ్ సమాఖ్య ప్రతినిధులు ప్రస్తావించగా, వాటిని ఏ విధంగా అధిగమించాలో, సమస్య ఏర్పడకుండా ఏం చేయాలో, ప్రభుత్వ పథకాలకోసం ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో, ఏవిధంగా ఉపయోగించుకోవాలో ప్రభుత్వ ప్రతినిధులు వివరించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ అందించే సేవల విషయములో శ్రీమతి జోత్స్న వెంటనే స్పందించి చర్యలు మొదలు పెట్టడం విశేషం.

శ్రీమతి పద్మావతి మాట్లాడుతూ ప్రాజెక్ట్‌లో ఇప్పటి వరకు చేసిన, చేయవలసిన పనుల గురించి వివరించి, ఇలాంటి సంప్రదింపుల సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి జరగాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా ప్రాజెక్ట్ అధికారి శ్రీమతి భవాని వ్యవహరించారు. మెంటర్స్ శ్రీ రాజోజుల బ్రహ్మాచారి, శ్రీమతి అంజుమ్, శ్రీమతి రాణి, శ్రీమతి శిల్ప, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ■

గుర్తుంచుకో... అవును, కాదు ఈ రెండు మాటలే నీ గమ్యాన్ని నిర్ణయిస్తాయి

# 'అనంత' జీవనోపాధుల ప్రాజెక్టుల పై సమీక్ష !

– గోపాలరాజు

అనంతపురం జిల్లాలో పని చేస్తున్న వివిధ జీవనోపాధుల ప్రాజెక్టుల సిబ్బందితో మహిళాభివృద్ధి సొసైటీ (మాస్) మేనేజింగ్ డైరెక్టర్, సి ఇ ఓ శ్రీ సిఎస్ రెడ్డి 2019 మే 22 న అనంతపురం ఎఎఫ్ ఎకాలజి సెంటర్‌లో ప్రాజెక్టు వారీగా సమీక్షించారు. కార్యాచరణ ప్రణాళిక సమావేశమును నిర్వహించారు. ఎఎఫ్ఇసి డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశానికి మహిళాభివృద్ధి సొసైటీ డైరెక్టర్లు శ్రీ వినాయకరెడ్డి, శ్రీ జయరాం, ఎపిడిఎంపి, ఎల్ఎఫ్ఎ, ఎఫ్ఎ, హార్టికల్చర్, క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టు, జి4 ప్రాజెక్టుల సిబ్బంది మొత్తం 25 మంది హాజరైనారు.

మహిళాభివృద్ధి సొసైటీ గత 17 సంవత్సరాలుగా అనంతపురం జిల్లాలో పని చేస్తున్నదని, మొదటి పది సంవత్సరాలు మహిళా సంఘాల సుస్థిర అభివృద్ధి కోసం వివిధ స్థాయిలలో పని చేయగా, 2010 సంవత్సరం నుండి జీవనో పాధుల కార్యక్రమంలో భాగంగా వాటర్‌షెడ్ కార్యక్రమాలను నల్లమాడలో ప్రారంభించి, రైతులతో, రైతు కూలీలతో కలసి పని చేస్తున్నదని శ్రీ సి ఎస్ రెడ్డి వివరించారు.



వాటర్ షెడ్ కార్యక్రమాలు పూర్తి అయిన తరువాత రైతులను అలాగే వదిలివేయకుండా వారితో కలసి పని చేయడానికి జి4 ప్రాజెక్టును, రైతు సహకార సంఘాలను మరింత బలోపేతం చేయడానికి కరువు సంసిద్ధతా కార్యక్రమాన్ని 'పల్లెజీవం' ప్రాజెక్టు ద్వారా కదిరి, మడకశిర ప్రాంతంలో ఎన్‌పి కుంట, గాండ్లపెంట, తలపుల, తనకల్లు, ఒడిసి, ఆమడగూరు, లేపాక్షి, పరిగి, మడకశిర, రొళ్ళ, అగలి, గుడిబండ వంటి 12 మండలాలలో, హార్టికల్చర్ ప్రాజెక్టు ద్వారా గుత్తి, పామిడి, గార్లదిన్నె, పెద్దవడుగూరు మండలాలలో, క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టు ద్వారా గుడిబండ, నల్లమాడ మండలాలలో పని చేస్తున్నది అని ఆయన తెలిపారు.

ఈ ప్రాజెక్టులన్నీ రైతు సంస్థలను బలోపేతం చేయడం కోసం, వాటిని సుస్థిర అభివృద్ధి పథంలో నడపడంకోసం ఉద్దేశించినవని ఈ సంస్థల భాగస్వాములమందరం కలసి పని చేయడమే కాకుండా ఆర్‌డిటి, ఎఎఫ్ఇసి వంటి రైతు సంస్థలతో కలసి పని చేస్తున్న సంస్థలతో సమన్వయంగా పనిచేయడం ఎంతైనా అవసరమని, తద్వారా రైతు సంస్థలకు మరింత బలం చేకూర్చినవారమవుతామని శ్రీ సి ఎస్ రెడ్డి పేర్కొన్నారు.

డాక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని లాభసాటి దిశగా తీసుకుపోవడానికి వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు, వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమాలు , వ్యవసాయ పరిశోధనా కార్యక్రమాలను మహిళాభివృద్ధి సొసైటీ నిర్వహిస్తున్నదని, తమ సంస్థ ఏర్పాటు చేసిన రైతు సంస్థల ద్వారా రైతులు, సిబ్బంది పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం గూర్చి శిక్షణలో, సందర్శనా యాత్రలో పాల్గొనవచ్చునని, అలాగే తాము నిర్వహిస్తున్న స్మార్ట్ ఎనర్జీ, బయోగ్యాస్, సోలార్ పంప్స్, వంటి వాటిని సందర్శించ వచ్చునని అన్నారు.

ఈ సమావేశంలో ప్రాజెక్టు వారీగా అభివృద్ధి గురించి, రాబోవు మూడు నెలలకు కార్యాచరణ ప్రణాళికల గూర్చి సంబంధిత ప్రాజెక్టు సిబ్బంది వివరించారు. ఇలాంటి సమావేశాలు ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహిస్తే సిబ్బంది అవగాహన పెంచుకోవచ్చునని, రైతు సంస్థలను మరింత పటిష్ట పరచడానికి అవకాశం ఉంటుందని శ్రీ సి ఎస్ రెడ్డి అన్నారు. ■

**విజయం అంటే ఆశించిన దాన్ని సాధించడం కాదు, సాధించి తీరవలసినదాన్ని ఆశించడమే**

# పోషణ, జెండర్ అంశాలకు స్వచ్ఛంద కార్యకర్తల ఎంపిక

భవిష్యత్తులో ఒంగోలు పట్టణంలో గర్భవతులు, బాలింతలు చిన్నపిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారం గురించిన కార్యక్రమాలను స్లమ్ సమాఖ్య ఆధ్వర్యంలో కొనసాగించ డానికి ప్రస్తుత ఆరోగ్య కార్యకర్తతో పాటు మరికొంతమంది సంఘ లేదా సమాఖ్య సభ్యులకు కూడా అవగాహన కల్పిస్తూ, భవిష్యత్తులో జెండర్, పోషణ అంశాలపైన స్వతంత్రంగా



పని చేయగలిగేలా తీర్చిదిద్దాలనే ఆలోచనతో, ఆసక్తి ఉన్న సభ్యుల బృందాన్ని మహిళాభివృద్ధి సొసైటీ తయారు చేసింది. స్వచ్ఛందంగా పని చేయగలిగిన 48 మహిళలను వివిధ స్లమ్‌ల నుండి గుర్తించి వారి బాధ్యతలను తెలియజేసి సంబంధిత స్లమ్ సమాఖ్య సమక్షంలో వారి అంగీకారం తీసుకోవడం జరిగింది. ఈ క్రింది లక్షణాలు కలిగినవారిని స్వచ్ఛంద కార్యకర్తలుగా ఎంపిక చేయటం జరిగింది

- సంఘం, సమాఖ్యల కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనుట
- ఆరోగ్యం , పోషణ గురించి పని చేయాలనే ఆసక్తి కలిగియుండుట
- ప్రభుత్వ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనుట
- నాయకత్వ లక్షణాలు కలిగియుండుట

**స్వచ్ఛంద కార్యకర్తల ద్వారా ఆశిస్తున్న ఫలితాలు**

- స్లం, సమాఖ్య పరిధిలో ఆరోగ్య, పోషణ అంశాల గురించి పని చేయగలిగే బృందంగా ఏర్పడాలి.
- ప్రాజెక్టు ముగిసిన అనంతరం కూడా గర్భవతులు, బాలింతలు, పిల్లలకు గృహసందర్శనల ద్వారా అవసరమైన సమాచారాన్ని ఎప్పటికపుడు అందించాలి
- సమస్యల పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ, ప్రభుత్వేతర విభాగాలతో సమన్వయం కలిగి వుండాలి
- సమాఖ్య కు బాధ్యత పెరుగుతుంది, ఆరోగ్యవిషయాల గురించి స్వతంత్రంగా పనిచేయగలుగుతాయి.

■

## పిండిపదార్థాలతోనే మేధో శక్తి !

ప్రపంచంలో ఒక్క మానవుడికి తప్ప ఏ ఇతర జీవులకీ వాటి శరీర పరిమాణానికి తగిన మెదడు పరిమాణం లేదు. మానవుడిలో ఈ విధంగా మెదడు పెరగడానికి కారణం పిండి పదార్థాలట. కొన్ని వందల సంవత్సరాల నుంచి మానవుడి మెదడు అభివృద్ధి చెందడంలో ప్రముఖ పాత్ర కార్బోహైడ్రేట్లదేనని బార్సిలోనా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రస్తుత సమాజంలో చాలామంది మెదడు ఎదుగుదలకు జంతువుల నుంచి లభించే ప్రొటీన్లపైనే ఆధారపడుతున్నారు. ప్రకృతిలో లభించే పిండిపదార్థాలు మానవుడి మెదడు ఎదుగుదలకు చాలా ఉపకరిస్తాయి. రక్తంలోని 60 శాతం గ్లూకోజ్‌ని, శరీరంలోని 25 శాతం శక్తినీ మెదడు వాడుకుంటుంది. తక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్న పదార్థాలను తిన్నప్పుడు మెదడుకి సరైన పరి మాణంలో గ్లూకోజ్ అందదు. అందువల్ల పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే వాటిని తినడం వల్ల మెదడు పరిమాణం గానీ, పనితీరుగానీ మెరుగ్గా ఉంటుంది. అయితే పచ్చి వాటిని నేరుగా తింటే అవి జీర్ణంకావడం చాలా కష్టం అందుకని వాటిని ఉడికించుకొని తినాలి 'అని బార్సిలోనా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ కరెన్ హార్డీ అంటున్నారు. ■

పొరపాటు చేశావా? ఒప్పుకో, ఫలితమెలా వుంటుందో తెలుసుకో, మళ్ళీ ఆ పొరపాటు చేయకు

# రాజస్థాన్‌లో 'మాస్'చే స్వయం సహాయ సంఘాల ఆడిట్

– నవీన్

'మహిళాభివృద్ధి సొసైటీ ' (మాస్) స్వయం నియంత్రణ ఉద్యమంలో భాగంగా భారతదేశంలో వివిధ సంస్థలకు సాంకేతిక సహకారం అందిస్తున్న విషయం పాఠకులకు విదితమే. 2020 వరకు ఈ రకమైన సేవలను సమకూర్చడానికి ఈ క్రింది సంస్థలతో 'మాస్'సాంకేతిక ఒప్పందం కుదుర్చుకున్నది.

| సంస్థ పేరు | రాష్ట్రం |
|---|---|
| 1. ఐబిటిఎడిఎ | రాజస్తాన్ |
| 2. పిఇడిఒ (పీపుల్స్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) | రాజస్తాన్ |
| 3. సిఎంఎఫ్ | రాజస్తాన్ |
| 4. డబ్ల్యుఐఎస్ఇ (ఉమెన్స్ ఇంటిగ్రేటెడ్ అండ్ సినర్జిస్టిక్ ఎంపవర్‌మెంట్) | మధ్య ప్రదేశ్ |
| 5. పిఎఎన్ఐ (పీపుల్స్ యాక్షన్ ఫర్ నేషనల్ ఇంటిగ్రేషన్) | ఉత్తరప్రదేశ్ |
| 6. శ్రామిక్ భారతి | ఉత్తరప్రదేశ్ |
| 7. బిఆర్ఎల్‌పిఎస్ (బీహార్ రూరల్ లైవ్‌లీహుడ్స్ ప్రమోటింగ్ సొసైటీ | బీహార్ |
| 8. ఎసిసిఐఒఎన్ ఫ్రాటెర్నా | ఆంధ్రప్రదేశ్ |

ఐబిటిఎడిఎ అనే సంస్థ 1997లో ప్రారంభించబడింది. వారు మొత్తం 949 స్వయం సహాయక సంఘాలను ఏర్పాటుచేసి వారితో ఇప్పటికే 4 బ్లాకులలో 4 బ్లాక్ స్థాయి



సమాఖ్యలను ఏర్పాటు చేయించారు. వీరు మాస్ ఏర్పాటు చేసిన 'స్వయం నియంత్రణ – స్వయం సహాయక



సంఘం'లో అనే కార్యశాలకు 2017 డిసెంబర్‌లో హాజరయి, మహిళాభివృద్ధి సొసైటీ తెలంగాణలోని కామారెడ్డిలో అనుసరిస్తున్న స్వయం నియంత్రణ ఉద్యమం పట్ల ఆకర్షితులై వారి సమాఖ్యలలో కూడా మాస్ సహకారంతో అమలు జరపాలని ఆకాంక్షిస్తున్నారు.

ఒప్పందంలో భాగంగా మహిళాభివృబుద్ధి సొసైటీ ఈ సమాఖ్య పాలకవర్గ సభ్యులకు 3 దఫాలుగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించడం జరిగింది. ఇప్పటివరకు మాస్ తోడ్పాటుతో వారు చేసిన వివిధ కార్యక్రమాల వివరాలు:

| కార్యక్రమాలు | సంఖ్య |
|---|---|
| స్వయం సహాయక సంఘాల ఆడిట్ | 246 |
| మానవ వనరుల గుర్తింపు (రిసోర్స్‌పర్సన్స్) | 22 |
| స్వయం నియంత్రణపై సంఘాలకు శిక్షణ | 949 |
| గ్రామ సంఘాలలో (మంచ్)లో వార్షిక యోజనలు | 8 |
| స్వయం సహాయక సంఘాలలో ఎన్నికలు | 129 |
| గ్రామ సంఘాలలో (మంచ్)లో ఎన్నికలు | 42 |
| ఉత్తమ సంఘాలు అవార్డులు పొందినవి | 35 |
| ఉత్తమ గ్రామసంఘ (మంచ్) అవార్డులు పొందినవి | 7 |

■

భయమే మరణం, ధైర్యంతో ముందడుగు వెయ్యడమే జీవితం

# ధరణి ఎఫ్ పి ఓ ప్రథమ వార్షిక సర్వసభ్య మహాసభ !

– సి హెచ్ వినోద

ధరణి వ్యవసాయ ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార సంఘం మొదటి వార్షిక మహాసభ సమావేశం పద్మాజివాడి రెడ్డి సంఘం భవనంలో 25.05.2019 న జరిగింది. ఈ సమావేశానికి శ్రీ పొన్న దేవేందర్ అధ్యక్షత వహించి సమావేశాన్ని నిర్వహించారు.

ముందుగా ప్రార్థనతో, జ్యోతి ప్రజ్వలనతో సమావేశాన్ని ప్రారంభించటం జరిగినది. తరువాత సభ్యుల రిజిస్ట్రేషన్ చేయటం జరిగినది. ఈ సమావేశాన్ని స్వయం నియంత్రణ ఉద్యమం పద్ధతిలో నిర్వహించటం జరిగింది. సమావేశమునకు కామారెడ్డి జిల్లా డి సి ఓ సబితా రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కార్యదర్శి వార్షిక నివేదిక చదివి వినిపించి, మహాసభ ఆమోదం పొందారు. తరువాత ఆడిట్ వినేదికను కోశాధికారి ఆంజనేయులు గారు చదివి వినిపించి, మహాసభ ఆమోదం తీసుకోవటం జరిగినది. తరువాత కార్యదర్శి గారు రాబోవు సంవత్సరము ప్రణాళిక చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఉత్తమ గ్రామరైతు సంఘం అవార్డ్ తిమ్మోజివాడి గ్రామరైతు సంఘానికి ఇవ్వటం జరిగినది. ధరణి ఎఫ్ పి ఓ బోర్డు నుండి నలుగురు సభ్యులను ఎన్నికల కమిటిగా నియమించి, వారి ద్వారా ధరణి ఎఫ్ పి ఓ బోర్డు ఎన్నికలు నిర్వహించటం జరిగినది. ధరణి ఎఫ్ పి ఓ బైలా సవరణ చదివి వినిపించి మహాసభ ఆమోదం పొందారు.

ఎన్నికైన నూతన పదాధికారులు: అధ్యక్షులు బోజు గంగాధర్, ఉపాధ్యక్షులు– ఎన్ పోతురెడ్డి, కార్యదర్శి–బోజు అశోక్‌రావు, సహాయ కార్యదర్శి– బి కౌసల్య, కోశాధికారి– డి ఆంజనేయులు. వీరిని రహస్య ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నుకున్నారు. ఈ మహాసభ సమావేశానికి 400 రైతు సంఘాల సభ్యులు, గ్రామపంచాయితి కార్యదర్శి, గ్రామ సర్పంచి ఆనంద్ గారు, ఏ ఇ ఓ స్నేహలత గారు పత్రిక విలేఖరులు, మహిళా అభివృద్ధి సొసైటి ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీ మధుమూర్తి గారు, ఐ సి బి మేనేజర్ శ్రీ శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ కిషోర్, సి బి ఓ – సి హెచ్ వినోద, ఎ ఓ టి – ఆర్.తిరుపతిరెడ్డి పి ఏ–అమృతరాణి, 9 గ్రామాల రైతుమిత్రలు హాజరయ్యారు. ■

---

# రైతు సమృద్ధి కేంద్రాన్ని సందర్శించిన జి.ఐ.జడ్ బృందం

జి.ఐ.జడ్ బృందం మే 13 వ తేదీన రామసముద్రం మండల వ్యవసాయ ఉత్పత్తిదారుల రైతు సమృద్ధి కేంద్రాన్ని సందర్శించింది. శ్రీ జోనాథన్ (జి.ఐ.సి. ప్రాజెక్ట్ డైరెక్టర్), జూలియా జుంగ్ (కమ్యూనికేషన్ ప్రవీణులు), మోనికా (ఇంటర్న్) అనే సభ్యులతో కూడిన ఈ బృందానికి రామ సముద్రం మండల సమాఖ్య ప్రెసిడెంట్ శ్రీ ఆర్ చెంగారెడ్డి ఈ కేంద్రంలో జరుగుచున్న కార్యక్రమాన్ని వివరించారు. ఈ కేంద్రాన్ని ఇ–ఫ్రెష్ సంస్థ తోడ్పాటుతో ఏర్పాటు చేయడం జరిగింది. ఇ–ఫ్రెష్ సంస్థ అనేక రకమైన వ్యవసాయ రంగ కంపెనీలతో చర్చించి, ఒప్పందం కుదుర్చుకొని రైతులకు సరసమైన ధరలు అందేటట్లు చేస్తుంది. ఇక్కడ రైతులకు కేంద్రంలో లభించే ఉత్పత్తుల మీద అవగాహన కొరకు టీ.వి. డిస్‌ప్లే ఏర్పాటు చేశారు. రైతు సమృద్ధి కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన నీటిలో కరిగే ఎరువులు, జిగురు అట్టలు, లింగార్షక బుట్టలు, బ్యాటరి మరియు 2 స్ట్రోక్ డీజల్ ఇంజన్ స్ప్రేయర్లు, విత్తనం నాటే ఎంత్రం, పశువుల దాణా సప్లిమెంట్, గడ్డి కోసే పరికరాలు, ప్లాస్టిక్ మల్చింగ్, టార్పాలిన్, పంపుసెట్లను నియంత్రించే మొబైల్ స్మార్ట్ పరికరాలు, పురుగు మందులను కొట్టేటప్పుడు వాడే సంకర్షణ కిట్ (గ్లవ్స్, గాగుల్స్, అప్రాన్, బూట్స్) ఇవ్వన్ని ఇక్కడ సరసమైన ధరకు విక్రయిస్తున్నారు.

రైతు సమృద్ధి కేంద్రం రైతులకు చేస్తున్న సేవలను, మహిళాభివృద్ధి సొసైటీ కృషిని జి.ఐ.జడ్ బృందం వారు అభినందించారు. ■

చరిత్ర సృష్టించిన వారంటే ఓడిపోని వారనికాదు, ఓటమితో ఆగక గెలుపు అంతు చూసిన వాళ్ళు

# జీవశక్తిని పదింతలు చేసే గోధుమ గడ్డి రసం !

**భూ**మిలో పాతుకుని ఉన్నంత సేపే ఏ చెట్టయినా పచ్చపచ్చగా మెరిసిపోతుంది. ఒక్కసారి ఆ భూమితో తెగతెంపులు చేసుకుని, వేళ్లు పెకిలించుకుని, ఈవలికి వచ్చిపడిందా...! పచ్చదనమంతాపోయి ప్రాణరహితంగా మారిపోతుంది. ప్రకృతి నుంచి ప్రకృతి సిద్ధ జీవనశైలి నుంచి దూరంగా వెళుతున్న మనిషి పరిస్థితి కూడా ఇప్పుడు అలాగే ఉంది. ఆధునిక జీవనంలో ప్రధాన భాగమైపోయిన పిజ్జాలు, బర్గర్ల నుంచి, సూప్స్, కూల్ డ్రింక్స్ దాకా.... అన్నీ. ప్రాణాల్ని హరింపచేసేవే తప్ప వీటిల్లో ఏ ఒక్కదానికైనా



ప్రాణాల్ని నిలబెట్టే శక్తి ఉందా? నిజానికి వేల సంవత్సరాల క్రితమే కొందరు మహర్షులు అద్భుతమైన ప్రకృతి చికిత్సా విధానాలెన్నో సూచించారు. వాటిల్లో ఏ కొన్ని పాటించినా మానవ శరీరాలు ఇంతగా రోగ గ్రస్తమయ్యేవే కాదు.

ప్రస్తుతం మనం ఏ ఆహార పానీయాలు తీసుకున్నా వాటిల్లో శక్తిదాయకాలెన్ని, రోగకారకాలెన్ని, రోగనిరోధక శక్తిని పెంచేవెన్ని, ఈ దృష్టితో చూడాల్సి వస్తోంది. ప్రస్తుతానికి గోధుమ నారు (గోధుమ గడ్డి) రసం లేదా పొడినే తీసుకుంటే... మనిషిలోని రోగనిరోధక శక్తిని పెంచడంలో జీవశక్తిని పదింతలు చేయడంలో దాని పాత్ర ఎంతో కీలకమని చెప్పే పలు శాస్త్రీయ విశ్లేషణలు మన ముందున్నాయి. మన శరీరానికి అవసరంగా మనసుకు ఆసక్తికరంగా అనిపించే వాటిల్లో అన్నింటికి అన్నీ మేలు చేసేవిగా ఏమీ ఉండవు. మనకు అందుబాటులో ఉన్న ఏ పదార్థంలోనైనా శరీరానికి మేలు చేసేవాటితో పాటు కీడు చేసేవీ ఉంటాయి. అయితే ప్రకృతి సిద్ధమైన వాటిల్లో ప్రత్యేకించి గోధుమ నారులో మాత్రం ఆరోగ్యదాయకమైనవే తప్ప వాటిల్లో ఏ ఒక్క అంశమూ హానికారకమైనవి కావు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా నేడు ఈ గోధుమ గడ్డి రసం లేదా చూర్ణం ఒక ఔషధంగా ఆదరణ పొందుతోంది.

**ఆపద్బాంధవి?....**

ప్రతి మనిషిలోనూ సహజంగానే ఒక నిరోధక వ్యవస్థ ఉంటుంది. చాలా జబ్బుల నుంచి నిరంతరం అది మనిషిని కాపాడుతుంది. ఎప్పుడైనా ఆ రోగ నిరోధక శక్తికి మించిన సమస్య తలెత్తినప్పుడే వైద్య చికిత్సలు అవసర మవుతాయి. కాకపోతే కాలగతిలో వస్తున్న వివిధ పరిణామాల్లో భాగంగా హానికారక ఆహార పానీయాల వల్ల కలుషిత వాతావరణం వల్ల మానసిక ఒత్తిళ్ల వల్ల అతనిలోని వ్యాధినిరోధక శక్తి రోజురోజుకూ తగ్గిపోతోంది. ఫలితంగా శరీరాలు అనునిత్యం అనారోగ్యం పాలవుతున్నాయి. ఈ స్థితిలో గోధుమ గడ్డి చూర్ణం, రసం ఉపకరిస్తాయి

- గోధుమగడ్డి రసం లేదా చూర్ణం సహజసిద్ధమైన పౌష్టికాహారం. అదే సమయంలో ఔషధంగా కూడా ఇది పనిచేస్తోంది. మౌలికంగా గోధుమ నారు పొడిలో 111 రకాల పోషక పదార్థాలు ఉన్నాయి. మరోరకంగా చెప్పాలంటే కిలోల కూరగాయలు ఇచ్చే శక్తిని ఒక కిలో పచ్చి గోధుమ నారు ఇస్తుంది. గోధుమ నారులో

ఎ, బి, సి, ఇ మొదలైన విటమిన్లు, ప్రొటీన్లు, అమీనో యాసిడ్లు, ఎంజైములు, క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం సమృద్ధిగా ఉన్నాయి. వీటితో పాటు సోడియం, పొటాషియం, జింక్, భాస్వరం, సెలీనియం వంటి ఖనిజాలు, పత్రహరితం, పీచుపదార్థం, మానవ శరీరానికి కావలసిన పరిణామంలో ఉన్నాయి.



- శరీరానికి అవసరమైన మొత్తం 22 అమైనో యాసిడ్స్‌ల్లో 19 ఒక్క గోధుమ నారులోనే లభిస్తాయి.
- గోధుమ నారులో పత్రహరితం (క్లోరోఫిల్) 70 శాతం ఉంది. మనిషి రక్తానికి ఎరుపుదనం తెచ్చే హెమిన్ కణ స్వరూపానికీ, క్లోరోపిల్ కణ స్వరూపానికీ మధ్య సారూప్యత ఉండడమే కాదు అంతే శక్తిమంతంగా కూడా పని చేస్తుంది.
- గోధుమ నారు రసంలో అతి త్వరితంగా రక్తంలో కలిసిపోయి అన్ని కణాలకూ వ్యాపించి వాటిని బలోపేతం చేసే శక్తి ఉంది.
- గోధుమ నారు లోని ఈ పత్రహరితంతో పాటుగా ఇంకా అనేక ఇతర పదార్థాలు ఉండడం వల్ల గోదు నారు రసాన్ని గ్రీన్ బ్లడ్ అని కూడా అంటారు. ఇది రక్తహీనతను (అనీమియా)ను తగ్గిస్తుంది. క్లోరోఫిల్‌లో ఉండే క్రిమిసంహారక శక్తి కూడా ఎక్కువే. ఇది యాంటీ సెప్టిక్‌గా పనిచేస్తుంది.
- ఆస్తమా, అల్సర్లు, చర్మవ్యాధులు, చిన్నపేవు ఉబ్బడం, గాయాలు మానకపోవడం వంటి సమస్యలను గోధుమ నారు చూర్ణం నయం చేయగలదు. శరీరంలోని విషపదార్థాలను తొలగించగలదు.
- గోధుమ నారు చూర్ణంలో కరగని, కరిగిపోయే ఈ రెండు రకాల పీచుపదార్థాలూ ఉన్నాయి. ఇందులోని కరగని పీచుపదార్థం చిన్న పేగులో, జీర్ణకోశంలో ఆహారపు కదలిక జరిగేలా చూస్తుంది. దీనివల్ల మలబద్ధకం పోయి శరీరంలో విషపదార్థాలు చేరే అవకాశం లేకుండాపోతుంది. కరిగే పీచుపదార్థం కార్బోహైడ్రేట్లు శరీరంలో ఇమిడిపోయే విధానాన్ని ఆలస్యం చేస్తుంది. దీనివల్ల రక్తంలోని చక్కెర స్థాయి అదుపులోకి వస్తుంది. పీచుపదార్థం కేన్సర్ నిరోధకంగా కూడా పనిచేస్తుంది.
- జీర్ణాశయానికి సంబంధించిన మలబద్ధకం అసిడిటీ, పైల్స్, కోలైటిస్, అల్సర్స్ తో పాటు కిడ్నీ సమస్యలను కూడా గోధుమ నారు చూర్ణం దూరం చేస్తుంది. అలర్జీ, సొరియాసిస్, మొటిమలు, ఎగ్జిమా వంటి చర్మ రోగాల నుంచి విముక్తి కలిగిస్తుంది.
- కేన్సర్, బి.పి, బహిష్టు, సమస్యలు, పక్షవాతం, లుకేమియా, కీళ్లనొప్పులు, ఆర్థరైటిస్, నిద్రపట్టక



పోవడం, ఆస్తమా బ్రాంకైటిస్ నివారణకు కూడా పని చేస్తుంది. సాధారణ శక్తిహీనతను తొలగిస్తుంది.

**క్రమంగా పెంచాలి**

- ప్రారంభంలో ఈ రసాన్ని కొద్ది మోతాదులో తీసుకుంటూ క్రమంగా మోతాదు పెంచాలి. మామూలు జబ్బులకు 10 మి.లీ రసం చాలు. తీవ్రమైన వ్యాధితో బాధపడే వారు 25 నుంచి 50 మి. లీ రసం చొప్పున

ఏ చెడు అలవాటుకూడా దానంతట అది పోదు , ప్రయత్నించి వదిలించుకోవాలి

రోజుకు మూడు సార్లు తాగాలి. ఈ రసం తాగిన అరగంట దాకా మరేమీ తీసుకోకూడదు. ఈ రసాన్ని పొద్దున పరగడుపున తీసుకోవడమే మేలు.

- ఒకవేళ పొద్దున్నే తీసుకోవడం వీలు కాని వారు మధ్యాహ్నం కడుపు ఖాళీగా ఉన్నప్పుడు తీసుకోవచ్చు. వ్యాధిగ్రస్థులు తమ సమస్య నయం అయ్యేదాకా వరుసగా వాడవచ్చు. ఆరోగ్యవంతులు ఈ రసం తాగితే మరింత ఆరోగ్యవంతులవుతారు. వీరు 3 మాసాలు వాడిన తర్వాత ఆపేయాలి మళ్లీ మూడు నెలల తర్వాత వాడుకోవచ్చు. వీరు 2.5 గ్రాముల చూర్ణాన్ని ప్రతి రోజూ ఉదయం పరగడుపున 2.0 మి. లీ నీటితో కలిపి సేవించాలి.
- ఏదో వ్యాధికిలోనై దాని తాలూకు అనేక పరిణామాలకు ఆ తర్వాత బలికావడం కన్నా గోధుమ నారు రసం సేవించడం ద్వారా ఆ వ్యాధులను అసలే దరిచేరకుండా చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**ఎలా తీసుకోవాలి?**

గోధుమ నారులో అనేకమైన విటమిన్లు, ఖనిజాలు, అమినో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఒకే పదార్థంలో ఇవన్నీ ఉండడం వల్ల ఒక్కుమ్మడిగా వాటన్నింటినీ తీసుకోవడంలో తొలుత మన శరీరం కొంత ఇబ్బంది పడుతుంది. మరీ ముఖ్యంగా మన శరీరంలో మలినాలు బాగా పేరుకుపోయినప్పుడు వాటిని స్వీకరించడానికి శరీరం ఇష్టపడదు. అందువల్ల ముందు బాగా విరేచనం అయ్యేలా చూసుకోవాలి. నాలుగు రోజుల పాటు ఘనాహారం ఏమీ తీసుకోకుండా వెచ్చని నీరు, పండ్ల రసం తీసుకోవాలి. చాలా స్వల్పంగా ఉడికించిన కాయగూరలు తీసుకోవచ్చు. ఇలా నాలుగు రోజులు గడిపాకే గోధుమ నారు రసంగానీ, చూర్ణం గానీ తీసుకోవాలి. గోధుమ నారు రసంలో పీచు పదార్థం ఉండదు. కాబట్టి చూర్ణాన్ని నీళ్ళల్లో కలుపుకుని తీసుకోవడమే ఉత్తమం. గోధుమ నారు రసాన్ని తయారు చేసుకున్న వెంటనే తాగెయ్యాలి. చాలాసేపు అలాగే ఉంచితే అందులోని ఔషధ గుణాలు తగ్గుతాయి. ఒకవేళ ఈ రసం వగరుగా, ఘాటుగా అనిపిస్తే కొంచెం తేనె కలిపి తాగవచ్చు. ■

## పాలేకర్ వ్యవసాయ విధాన అధ్యయనానికి కమిటి

సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ (ఎస్.పి.ఎన్. ఎఫ్.) పద్ధతి (దీన్ని మొదట్లో 'పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం' అనేవారు) ని అనుసరించడం వల్ల ఒనగూడు తున్న ప్రయోజనాలు, ఎదురవుతున్న సవాళ్లపై సమగ్ర అధ్యయనానికి కేంద్రం శ్రీకారం చుట్టింది.



12 మంది వ్యవసాయ నిపుణులతో కూడిన జాతీయ స్థాయి కమిటీని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐ.సి.ఎ.ఆర్.) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డా. ఎస్. భాస్కర్ ఇటీవల నియమించారు. ఈ కమిటీకి ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. వి. ప్రవీణ్‌రావు సారధ్యంవహిస్తారు.

ఈ ఉన్నత స్థాయి జాతీయ కమిటీలో ఐ.సి.ఎ.ఆర్. డీడీజీ డా. ఎస్. భాస్కర్‌తోపాటు మోదీపురంలోని భారతీయ వ్యవసాయ వ్యవస్థల పరిశోధనా సంస్థ సంచాలకులు డా. ఎ. ఎస్. పన్వర్, జాతీయ సేంద్రియ వ్యవసాయ పరిశోధనా స్థానం సిక్కిం సంయుక్త సంచాలకులు డా. ఆర్. కె. అవస్థె, కోయంబత్తూర్‌లోని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం సుస్థిర సేంద్రియ వ్యవసాయ విభాగం అధిపతి ప్రొ. ఇ. సోమసుందరం, ఉదయ్‌పూర్‌లోని ఎం.పి.ఎ.ఎ.టి. సేంద్రియ పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ డా. ఎస్.కె. శర్మ, పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం లుధియానా సేంద్రియ వ్యవసాయ కేంద్రం డైరెక్టర్ డా. సి.ఎస్. యూలఖ్, అపెడా (ఘజియాబాద్) మాజీ సంచాలకుడు డా.ఎ.కె యాదవ్, కేంద్రవ్యవసాయ, సహకార రైతుల సంక్షేమశాఖ సంయుక్త కారదర్శి, నీతి ఆయోగ్ వ్యవసాయ సలహాదారు సభ్యులుగా ఉంటారు. భారతీయ సాగు వ్యవస్థల పరిశోధనా సంస్థ (మోదిపురం) ముఖ్య శాస్త్రవేత్త డా. ఎన్. రవిశంకర్ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. ■

**అనుభవాలు ముందడుగు వేయించే దీపాలుగా వుండాలి, వెనక్కునెట్టే ఈదురుగాలులు కాదు**

# మట్టి పాత్రలో వంట మధుమేహానికి విరుగుడు !

**మ**ట్టి పాత్రలో అంత సాంకేతికత ఉందా ! మధుమేహానికి (షుగర్) కు దీనికి లంకె ఏమిటి ? నమ్మలేని నిజమిది!

మట్టి పాత్రలో ఎప్పుడో మన అమ్మమ్మలు ఇంకా చెప్పాలంటే వాళ్ల అమ్మల కాలంలో వంట చేసేవారంట అని చెప్పుకొనే రోజులు వచ్చేశాయి.



మట్టి పాత్రలో వండుకోవలసిన ఖర్మ మాకేమిటి అంటున్నారు. అయితే అదంతా మట్టి పాత్రల గొప్పతనం తెలియకే? నాన్ స్టిక్, స్టెయిన్‌లెస్ స్టీలు, అల్యూమినియం పాత్రలు వాడటం ద్వారా ఆరోగ్య సమస్యలు తప్పవు. ఇంక కొంతమంది పెద్దలు మట్టి పాత్రల ద్వారా ఆహారాన్ని తీసుకోవటం ద్వారా ఆరోగ్యంగా ఉంటున్నారని ఆరోగ్య నిపుణులు చెపుతున్నారు! కాబట్టి మట్టి పాత్రలు ద్వారా వంట చేయటం ఎంతో మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. నిజానికి మట్టి పాత్రలో వంటచేస్తే చాలా రుచిగా ఉంటుంది. ఎక్కువ కాలం చెడిపోకుండా నిలువ వుంటాయి. కావాలంటే మీ అమ్మమ్మనో నాయనమ్మనో అడగండి.

**మట్టి పాత్రలో ఏముంది ?**

అసలు మట్టి పాత్రలో ఏముందో చూద్దాం మన ఆరోగ్యానికి కావలసిన 18 రకాల "మైక్రో న్యూక్లియంట్స్" ఈ మట్టిలో వున్నాయి. మట్టి పాత్రలో ఆహారాన్ని వండటం వలన వచ్చిన పరీక్షా ఫలితం ఏమిటంటే ఈ వంటకంలో ఒక్క మైక్రో న్యూట్రియంట్ కూడా తగ్గలేదు. మామూలు లోహ పాత్రలలో వండిన పదార్థాలలో 7%, 13% మాత్రమే మైక్రో న్యూట్రియంట్స్ వున్నాయి. మట్టి పాత్రలో మాత్రం 100% మైక్రో న్యూట్రియంట్స్ పదిలంగా వున్నాయి. ఈ వంటకాలకు రుచి కూడా అద్భుతంగా వుంటుంది. అలాగే మట్టి పాత్రలను తయారు చేసే బురద మట్టిని సిరామిక్ అంటారు. ఈ సిరామిక్‌కు వేడి తగలగానే కంటికి కనిపించని ఇన్ఫ్రారెడ్ కిరణాలు (ఇన్విజబుల్ రేస్) ఉత్పత్తి అవుతాయి. ఈ కిరణాలు వెదజల్లిన ప్రాంతమంతా పూర్తిగా శుద్ధి చేయబడుతుంది.

మీకు తెలిసే వుంటుంది ఎవరైనా పిల్లలు బలహీనంగా తక్కువ బరువుతో పుట్టినా, పుట్టుకతోనే కామెర్లు లేక ఏదైనా అనారోగ్యంతో పుట్టినా ఇంక్యుబేటర్ అనే పరికరంలో కొన్ని గంటలు పాటు వుంచుతారు. ఆ పరికరంలో వుండే లైట్ ద్వారా ఇన్ఫ్రారెడ్ కిరణాలను ప్రసరింప చేసి పుట్టిన



పిల్లల శరీరాన్ని పూర్తిగా శుద్ధి చేస్తారు. కేవలం కొద్ది గంటల్లోనే నవజాత శిశువుకు పూర్తి స్థాయి ఆరోగ్యాన్నిచ్చే శక్తి ఈకిరణాలకే వుంది.

కాబట్టి మట్టి పాత్రలకు అంత శక్తి, టెక్నాలజీ వుందన్నమాట. జీవితాంతం మనకు కావాల్సిన న్యూట్రియంట్స్ అందుతుంటే మన పనులు మనమే చేసుకుంటూ ఎవరిమీద ఆధారపడకుండా జీవించగలం. ఇది కూడా మట్టి పాత్రలో వంటచేసి తినడం ద్వారానే.

చక్కెర వ్యాధి వున్న వారికి ఈ మట్టి పాత్రల ద్వారా వండిపెడితే కొన్ని నెలల లోపే డయాబిటీస్ నుండి విముక్తులవుతారని పరిశోధన ఫలితాలు చెబుతున్నాయి.

**మట్టి కుండలో నీళ్ళు**

ఫ్రిజ్‌లో కాకుండా మట్టికుండలో చల్లబడే నీరు శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. మట్టితో తయారు చేసిన కుండల్లో కొన్ని పోషకాలు నీటితో జత కలిసి ఆరోగ్యానికి ఉపకరిస్తాయి. పూర్వకాలం నుంచి ప్రజలు అన్ని కాలాల్లో మట్టితో చేసిన పాత్రలతోనే నీటిని చల్లబరుచుకునే వారు. దీని ద్వారా ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగదు.

**సూక్ష్మ రంధ్రాలతో నీటిని చల్లబరిచే విధానం..**

సాధారణంగా ఫ్రిజ్‌లో గ్యాస్,విద్యుత్‌లను ఉపయోగించి నీటిని చల్లబరుస్తారు. కానీ, మట్టి పాత్రల్లో వాతావరణంలో ఉండే గాలితో బాష్పోత్సేకం ప్రక్రియతో నీటిని చల్లబర్చు కోవడానికి మట్టిలోని సూక్ష్మరంధ్రాలు ఉపయోగపడుతాయి.

**మట్టిలో ఉండే క్షారగుణం ఆరోగ్యానికి లాభం..**

మట్టి పాత్రలను తయారు చేసే మట్టిలో ఉండే క్షారగుణం వల్ల మానవ శరీరానికి ఎసిడిటీ సమస్య లేకుండా శరీరంలోని పీహెచ్ నిల్వలను సమతుల్యంగా ఉంచుతుంది. మట్టి పాత్రలోని నీళ్ళ వల్ల గ్యాస్ట్రిక్ నొప్పులు రాకుండా కాపాడుతుంది.

**జీవక్రియ మెరుగుపడుతుంది..**

సాధారణంగా ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ ఉంచిన నీటిని తాగడం ద్వారా అందులో ఉండే రసాయనాల వల్ల మానవ శరీరానికి సమస్యలు తలెత్తుతాయి. జీవక్రియ సమతుల్యంగా ఉండదు. దీని మూలంగా అనారోగ్య సమస్యలు చోటు చేసుకుంటాయి. కానీ, మట్టి పాత్రల్లోని నీటిని తాగడం వల్ల జీవక్రియ మెరుగుపడి టెస్టోస్టిరాన్ అధికంగా ఉత్పత్తి అవుతుంది.

**వడదెబ్బను అరికడుతుంది..**

ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఫ్రిజ్‌లోని చల్లని నీటిని తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రతలో బేధాలు ఏర్పడి వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. కానీ మట్టి పాత్రల్లోని నీటిని తాగ డం వల్ల శరీరంపై ఎలాంటి వడదెబ్బ ప్రభావం ఉండదు. ఇలా మట్టి పాత్రల వినియోగంవల్ల మన ఆరోగ్యానికి అనేకానేక ప్రయోజనాలు వున్నాయి. నామోషీ పడకుండా 'మళ్ళీ మట్టి పాత్రలకు మళ్ళుదాం ... మన ఆరోగ్యాలను పరిరక్షించుకుందాం !'. ■

## అకాల మరణాలను తగ్గించే చిరు ధాన్యాలు!

**చి**రు ధాన్యాలు ఆరోగ్యాన్నిస్తాయన్న సంగతి తెలిసిందే! వీటిని ప్రతి రోజూ తీసుకోవడం వలన అకాల మృత్యువు నుంచి తప్పించు కోవచ్చు అంటున్నారు హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు. వీటి ద్వారా లభించే మల్టిపుల్ బయో యాక్టివ్ కాంపౌండ్ పలు ఆరోగ్య సమస్యలను దూరం చేస్తుందని వీరు చెబుతున్నారు.



ప్రతిరోజూ 70 గ్రాముల చిరుధాన్యాలు తీసుకున్న వారిలో 22 శాతం అకాల మరణాలు తగ్గుతాయనీ 23 శాతం గుండెజబ్బుల బారి నుంచి తప్పించుకోవచ్చని వారు అంటున్నారు. 20 శాతం కేన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని స్పష్టం చేస్తున్నారు. కొద్దిగా వయస్సు పైబడిన వారు తప్పనిసరిగా 49 శాతం చిరుధాన్యాలను తమ ఆహారంలో చేర్చు కోవలసిందేనని వీరు అంటు న్నారు. సుమారు ఏడున్నర లక్షలమంది మీద దాదాపు 40 సంవత్సరాల పాటు సుదీర్ఘ అధ్యయనాలు నిర్వహించిన అనంతరం వీరు ఈ విషయాన్ని నిర్ధారించారు. ■

ఏ పరిస్థితులలో వున్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవలసిన పనులు అవే జరుగుతాయి

# కేన్స్‌లో సత్తా చాటిన 'మహిళా రైతు' లఘు చిత్రం!

మన భారతీయ మహిళా రైతుపై తీసిన లఘుచిత్రానికి అంతర్జాతీయ ' కేన్స్ ' చలన చిత్రోత్సవ వేదికపై అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ దర్శకుడు అచ్యుతానంద ద్వివేది తెరకెక్కించిన 'సీడ్ మదర్' (విత్తనాల తల్లి) లఘు చిత్రాన్ని



రాష్ట్రపతి నుంచి పురస్కారం అందుకుంటూ ...

కేన్స్‌లో ప్రదర్శించారు. మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ లఘు చిత్రానికి నెస్‌ప్రెసో టాలెంట్స్ కేటగిరీలో మూడవ బహుమతి లభించింది. మహారాష్ట్రకు చెందిన రహీబాయి సోమా అనే మహిళా రైతు నేపథ్యంలో దీనిని తెరకెక్కించారు. 1964లో పుట్టిన రహీబాయి ప్రాంతీయంగా లభించే విత్తనాలతో, పురాతన వ్యవసాయపద్ధతుల్లో పంటలు పండించడాన్ని ఒక ఉద్యమంగా చేపట్టారు.ప్రపంచ ప్రసిద్ధమైన బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ వార్తాసంస్థ (బీబీసీ) ఎంపికచేసిన వందమంది అగ్రశ్రేణి స్ఫూర్తిదాయక మహిళల్లో ఆమె మూడో స్థానం సంపాదించుకున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి కూడా ఆమె అవార్డును అందుకున్నారు.

దర్శకుడు అచ్యుతానంద్ తన నివాసంలోని గార్డెన్‌లో విత్తనాలు నాటేందుకు రహీబాయిని సంప్రదించారు. ఆమె గురించి తెలుసుకుని 'సీడ్ మదర్'ను తెరకెక్కించారు. సాంకేతిక రీత్యాకూడా మిర్రర్ లెన్స్‌తో ఈ లఘు చిత్రాన్ని తెరకెక్కించడం గమనార్హం.

ఈ ఏడాది కేన్స్‌లో ప్రదర్శించేందుకు మన భారతీయ చిత్రాలేవీ ఎంపిక కాలేదు. అలాంటిది ఓ భారతీయ మహిళా రైతు నేపథ్యంలో తీసిన లఘు చిత్రానికి ఇంతటి ఆదరణ వచ్చిందంటే గొప్ప విషయమనే చెప్పాలి. అదీకాకుండా ఈ ఏడాది కేన్స్ సందేశం 'వుయ్ ఆర్ వాట్ వుయ్ ఈట్' (మనం ఏం తింటామో అలాగే వుంటాం). అంటే ప్రపంచవ్యాప్తంగా ఆహార పదార్థాలు, వాటిని పండించే ప్రక్రియల నేపథ్యంలో తీసే సినిమాలను ప్రదర్శిస్తారు. ఈ ఏడాది 47 దేశాల నుంచి 371 వీడియోలు కేన్స్‌కు వెళ్లాయి. వాటిలో 'సీడ్ మదర్' ఒకటి. ■



చిత్ర రూపకర్త
అచ్యుతానంద ద్వివేది

## పుట్టినరోజు కేక్ ముఖంపై పూస్తే జైలుకే !

ప్రస్తుతం చాలామంది తమ పుట్టినరోజు వేడుకలను ఘనంగా చేసుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ఇటువంటి వేడుకలకు హద్దులు ఏర్పడనున్నాయి. వాటిని అధిగమిస్తే జైలుకు వెళ్లాల్సిరావచ్చు. గుజరాత్‌లోని సూరత్ పట్టణ పోలీస్ కమిషనర్ ఇందుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేశారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం సూరత్‌లో నిర్వహించే బర్త్ డే వేడుకలలో ముఖంపై కేక్ పూసినా, ఫోమ్ స్ప్రే చేసినా జైలుకు వెళ్లాల్సివుంటుంది. వివరాల్లోకి వెళితే సూరత్‌లోని ఇమాస్ రోడ్డులో ఇటీవల కొంతమంది ఒక బర్త్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కోడిగుడ్లు విసరడం కారణంగా పలువురు రోడ్డుపై పడిపోయి గాయాలపాలయ్యారు. దీనిపై పోలీస్ కమిషనర్ సతీష్ శర్మకు ఫిర్యాదు అందింది. దీనికి స్పందించిన పోలీసులు వేడుకలో పాల్గొన్న కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై సెక్షన్ 188 కింద కేసు నమోదు చేశారు. ఇటువంటి ఉదంతాలు తరచూ చోటు చేసుకుంటున్న కారణంగా పోలీస్ కమిషనర్ కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. ■

# పురుగుమందుల వినియోగంలో జర భద్రం !

- ఆహార పదార్ధాలతో బాటు కీటకనాశక మందులను రవాణా చేయరాదు.
- కీటకనాశక మందులను తాళం వేసి భద్రపరచండి.
- కీటకనాశక మందులను పిల్లలకు అందకుండా ఉండే చోట నిల్వచేయాలి.
- అసలైన ప్యాకింగులతోనే కీటకనాశని మందులను కొనండి.
- ఉపయోగించే ముందు లేబులును, వివరాల పత్రాన్ని పూర్తిగా చదవండి.
- రక్షణ కల్పంచే వస్త్రాలను ధరించండి.
- సిఫారను చేసిన పరిమాణాన్ని సరిగ్గా కొలిచి తీసుకోండి.
- నీటితో కలిపేటప్పుడు కర్రతో బాగా కలియబెట్టండి.
- మందు చిందకుండా ఉండటానికి గరాటును ఉ పయోగించండి.
- కీటకనాశిని మందు డబ్బాలను నీరులేదా ఆహారాన్ని నిల్వ చేయడానికి ఉ పయోగించకండి.
- గాలి వీచే దిశలోనే పిచికారీ చేయండి.
- నాజల్‌ను శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదకండి.
- పిచికారీ చేసేటప్పుడు తినకండి, త్రాగకండి, పొగ త్రాగకండి.
- చిల్లుపడిన, పాడయిన స్ప్రేయరును లేదా డస్లరును వాడకండి.
- ప్రయాదవశాత్తూ మందు పడితే, మలినమైన దుస్తులను,శరీరాన్ని నీటిలోశుభ్రం చేసుకోండి.
- పిల్లల చేత పిచికారీ చేయించవద్దు.
- మందు చల్లుతున్న ప్రదేశముల వద్ద ఆహార పదార్ధాలను ఉంచవద్దు.
- తినే ముందు, తాగే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- ప్రమాదవశాత్తూ విష ప్రభావం కలిగితే, ప్రాథమిక చికిత్స చేసి డాక్లరును సంప్రదించండి.
- డాక్లరుకు కీటకనాశని మందు డబ్బా వివరాల కరపత్రాన్ని చూపించి వెంటనే మంచి వైద్యచికిత్స చేయించండి.



- ఖాళీ డబ్బాలను విరగగొట్టి భూమిలో పాతిపెట్టండి.
- మందు చల్లడం పూర్తయిన తరువాత స్నానం చేయండి, దుస్తులను ఉతకండి.
- పరిసరాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోండి.
- మందుచల్లిన పొలంలో హెచ్చరిక బోర్డులను పెట్టండి.

**పురుగుల మందుల వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు:**

- డబ్బాల మీద ఉండే త్రిభుజ రంగును బట్టి పురుగు మందు విష ప్రభావం తెలుసుకోవాలి.
- ఎరుపు – అత్యంత (90%) విషపూరితం

- పసుపు – ఎక్కువ (70%) విషపూరితం
- నీలం – సాధారణ (50%) విషపూరితం
- ఆకుపచ్చ – తక్కువ (30%) విషపూరితం
- ఉపయోగించే ముందు లేబులును, వివరాల పత్రాలను చదవండి. మందు పిచికారి చేసేటప్పుడు ముఖానికి మాస్కు ధరించాలి.
- పిల్లలకు, పెంపుడు జంతువులకు అందకుండా ఉండే చోట నిల్వచేసి, తాళం వేసి భద్రపరచండి.
- పురుగు మందు డబ్బా మూతను నోటితో తీయరాదు. మందు డబ్బా, ప్యాకెట్ సీలు సరిగ్గా ఉన్నదో చూసి బిల్లు తీసుకోండి.



- మందు డబ్బా మూతలను చిన్న పరికరాలతో తీయాలి.
- చేతులకు రబ్బరు తొడుగు వేసుకోనే పిచికారి చేయాలి. చెవులకు దూది పెట్టుకొని ముక్కుకు మాస్కు ధరించి ముఖానికి రక్షణ కవచం ధరించాలి. తలకు టోపి పెట్టుకోవాలి.
- శరారం మొత్తం కప్పబడేలా లేవు, కాళ్ళకు బూట్లు వేసుకోవాలి.
- పురుగు మందు కొలవడానికి కొలత గ్లాసును వాడాలి. కావలసిన మోతాదులో నీరు కలపాలి.
- పుల్లతో మందు ద్రావణం కలపాలి. చేతులతో కలపరాదు.
- వాజిల్‌ను శుభ్రపరిచే ముందు నోటితో ఊదకుండా పిన్ను సయం తీసుకోండి.
- గాలివీచే దశలోనే ముందు పిచికారి చేయండి.
- నాణ్యమైన చిల్లులు లేని స్ప్రేయర్ను వాడాలి. మందు పడిన దుస్తులను, శరీరాన్ని నీటితో శుభ్రపరచండి. పిల్లల చేత పిచికారి చేయించరాదు. మందు జల్లే ప్రదేశాల్లో తినుబండారాలు ఉంచవద్దు.
- మొక్కలు పూర్తిగా తడిసేలా పిచికారి చేయాలి.
- చల్లని సమయాలలో మందును పిచికారి చేయాలి.
- పిచికారి చేసేటప్పుడు తినడం, పొగ త్రాగడం చేయరాదు.
- పిచికారి చేసే సమయంలో పానీయాలు, ఆహారం తీసుకోరాదు.
- పిచికారి చేసిన పిమ్మట శుభ్రంగా చేతులను కడుగుకొని ఆహారాన్ని తినాలి.
- పొలంలో పురుగు మందులను ఆహార పదార్థాలకు దుస్తులను శుభ్రం చేయాలి.
- పురుగు మందుల పిచికారి చేసిన తర్వాత దుస్తులను శుభ్రం చేయాలి.
- వాడిన డబ్బాలను పగలగొట్టి భూమిలో పాతండి.
- సాయంత్రం మందు చల్లడం పూర్తయిన తర్వాత స్నానం చేయండి.
- పరిసరాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకొని, మందుచల్లిన పొలంలో హెచ్చరిక బోర్డు పెట్టండి.
- మందు జల్లడం వలన విషప్రభావం కలిగితే ప్రాథమిక చికిత్స చేసి, వెంటనే డాక్టరు కబురు పంపి, మందు వైద్య చికిత్స చేయించండి.
- ఆహార పదార్థాలతో పాటు కీటకనాశిని మందులను రవాణా చేయరాదు.

■

నాయకుడు నీతివంతుడు కాకుంటే అనుచరులు విధేయులు కాలేరు

# సాగు యంత్రాల సృష్టికర్తలు.... రైతు నేస్తాలు !

**ఆ**ధునిక వ్యవసాయ పద్ధతులు అనేది వ్యవసాయంలో అనివార్యం. అందుకు అనుగుణంగా రైతులను చైతన్యపరిచేందుకు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. రోజురోజుకు వ్యవసాయంలో కూలీల కొరత పెరుగుతోంది. దీంతో యంత్ర పరికరాలు అనివార్యంగా మారాయి. ప్రధానంగా సేద్యం కోసం నాగళ్ళు, గొర్రు, గుంటక ఇలాంటివి అందరికీ తెలిసిన పరికరాలు.



అయితే శనగకు మందు పిచికారీ చేసేందుకు ఇంకొల్లు పొండ్రీ వర్కర్లు సరికొత్త పంథాను కనుగొన్నారు. గతంలో ట్రాక్టరుకు వారు తయారుచేసిన ట్యాంకుతో మందు పిచికారీ చేసే విధంగా రూపొందించారు. ప్రస్తుతం మనిషితో అవసరం లేకుండా శనగకు మందు పిచికారీ చేసేవిధంగా సరికొత్త యంత్రాన్ని కనుగొన్నారు. దీంతో శనగ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. దుక్కిలో సేద్యం తరువాత ఎద పద్ధతిలో రసాయన ఎరువులు, విత్తనాలు వెదపెట్టేందుకు ఇక్కడ మిషన్ గొర్రులు అందుబాటులో ఉంటాయి. వీటిని రైతులకు సబ్సిడీపై అందించే సంస్థలకు వారు సరఫరా చేస్తుంటారు.

**ఆర్డర్లపై తయారీ... మరమ్మతులు...**

సాధారణంగా కంపెనీల నుంచి వచ్చే ఏ యంత్రాన్నైనా కేవలం చూపులతో చూచి అంతకన్నా మిన్నగా స్థానిక అవసరాలకు అనువుగా తయారుచేస్తుంటారు. ఎలాంటి యంత్రపరికరానికి సంబంధించిన మరమ్మతులైనా ఇక్కడి మెకానిక్‌లు అవలీలగా చేస్తుంటారు. దీంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా గుంటూరు జిల్లాకు చెందిన రైతులు కూడా ఇక్కడకు వస్తుంటారు. శనగ నూర్పిడి మిషన్, మనిషి లేకుండా మందు పిచికారీ చేసే మిషన్, ఎరువు, విత్తనాలు ఎద పెట్టే మిషన్ ఇక్కడి ప్రత్యేకత. మిగిలిన యంత్రాలకు సంబంధించి కూడా ఇక్కడ అన్ని వనరులు అందుబాటులో ఉంటాయి. కంపెనీ ధర కన్నా ఎంతో కొంత తక్కువ ధరకు తయారుచేయటం వారి ప్రత్యేకత. దీంతో పాటు ఆక్వా చెరువుల్లో రొయ్య పిల్లలకు ఆక్సిజన్ అందించేందుకు ఉపయోగించే ఏరియేటర్స్‌ను కూడా ఇక్కడ తయారు చేస్తుంటారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల వారు ఏరియేటర్స్‌ను ఆర్డర్స్‌పై తయారుచేయిస్తుంటారు. మరమ్మతులకు ఇక్కడికే వస్తుంటారు.

**ఒకప్పుడు రెండు షెడ్లు... నేడు 20 కార్ఖానాలు...**

ఇంకొల్లు మూడు దశాబ్దాల క్రితం కేవలం రెండు షెడ్లు ఉండేవి. వాటిలో ట్రాక్టరు, వ్యవసాయ పరికరాలకు సంబంధించిన మరమ్మతులు చేసేవారు. చిన్నగా వారు స్థానిక అవసరాలకు అనుగుణంగా వ్యవసాయానికి అనువైన యంత్రాలు తయారుచేయటంతో ఇంకొల్లు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సుమారు 20 కార్ఖానాలు ఉన్నాయి. ఒక్కొక్కరి వద్ద నలుగురు నుంచి ఆరుగురు కార్మికులు ఉంటారు. కొత్త యంత్రాలు కొనుగోలు చేసేవారైనా ముందుగా ఇక్కడి మెకానిక్‌ల సలహా మేరకు కొనుగోలు చేస్తుంటారు. ఆ యంత్రాన్ని స్థానిక అవసరాలకు అనుగుణంగా రెండు, మూడు పనులు చేసే విధంగా మార్పు చేస్తుండటం అందుకు కారణం. ■



**అవహేళన, అడ్డంకులు, ఆ తరువాతే అంగీకారం ; ఏ విజయానికైనా తప్పని మూడు సూత్రాలు**

# మిరప పంటలో స్కూటర్‌తో కలుపు తీత !

## ముదిగుబ్బ రైతు శ్రీనివాసులు సరికొత్త ప్రయోగం

**కా**లానుగునంగా సాంకేతిక పరిజ్ఞానం కూడా మార్పు చెందుతూ వస్తోంది. ఇదే కోవలో వ్యవసాయంలో కాడెద్ల స్థానంలో యాంత్రీకరణకు నాంది పలుకుతోంది. ప్రస్తుతం కాడెద్లు కొనాలన్నా 70 వేల రూపాయల నుండి లక్ష రూపాయల వరకు పలుకుతోంది. ట్రాక్టర్ కొనాలన్నా లక్షలాది రూపాయలు వెచ్చించాలి. అయితే ఇంత మొత్తంలో




పెట్టుబడి పెట్టలేని ఓ రైతు తన ఆలోచనకు పదునుపెట్టాడు. తాను తరచూ వాడే స్కూటర్‌తో పంట కలుపు తీసేందుకు పూనుకున్నాడు.

ముదిగుబ్బకు చెందిన శ్రీనివాసులు మిరప పంట సాగు చేశారు. ఆదివారం పంటలో కలుపుతీతకు తన స్కూటర్‌నే వాడుకునానడు. స్కూటర్‌కు కలుపు తీసే పరికరాన్ని తాడు ద్వారా అమర్చారు. కాడెద్లతో ఎంత వేగంతో కలుపు తీస్తామో అంతే వేగంతో స్కూటర్ ద్వారా కలుపును తొలగించారు. రైతు శ్రీనివాసులు గంటకు 4 కిలోమీటర్ల వేగంతో స్కూటర్‌ను నడుపుతుండగా ... సతీమణి రత్నమ్మ కలుపు తీసే పరికరాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ కలుపును తొలగిస్తూ భర్తకు తోడుగా నిలిచింది. ఈ సందర్భంగా రైతు శ్రీనివాసులు మాట్లాడుతూ పశువులను కొనుగోలు చేసే స్థోమత లేక... అటు యంత్రాలకు అద్దె చెల్లించలేక తనకునన స్కూటర్‌తో కలుపు తీస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎకరా కలుపు తీయడానికి కేవలం 4 లీటర్ల పెట్రోల్ ఖర్చయిందని రైతు చెప్పుకొచ్చారు. ■

### 'చిటుక' లో గొర్రెల చావు !

తొలకరి వర్షాల్లో గొర్రెలకు సోకే ముఖ్యమైన వ్యాధి చిటుక రోగం.మంచి ఆరోగ్యంగా ఉండే జీవాలకు ఈ వ్యాధి సోకుతుంది. క్లాస్టిడియమ్ పెర్‌ఫ్రిజన్స్ టైప్ డి అనే బ్యాక్టీరియా వలన సోకుతుంది. ఎక్కువగా స్టార్చ్ సంబంధిత మేతను తింటే ఈ వ్యాధి సోకుతుంది. తొలకరి వర్షాల తర్వాత మొలిచిన లేత గడ్డిని మేసినప్పుడు ఈ సూక్ష్మ క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయి. వ్యాధి సోకిన తర్వాత ఏ లక్షణాలు చూపకుండా, చిటిక వేసే లోపే చనిపోతాయి. కాబట్టి చిటుక వ్యాధి అంటారు. కొన్ని ప్రాంతాల్లో నెత్తిపిడుగు వ్యాధి, గడ్డి రోగం అని అంటారు. జీవాలు నీరసంగా ఉండటం, చనిపోయే ముందు గాలిలోకి ఎగిరి గిలగిలా కొట్టుకుంటాయి. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఎక్కువగా కనబడుతుంది. దీని కారక సూక్ష్మజీవి 'ఎప్సిలాన్' అనే విష పదార్థాన్ని జీవం శరీరంలోకి విడుదల చేస్తుంది. దీనివలన జీవాలు చనిపోతాయి.

**చిటుక వ్యాధి నివారణ ఇలా..**

ఈ నెలలో అన్ని జీవాలకు టీకా వేయించాలి. తొలకరి వర్షాలకు మొలచి, వాడిపోయిన తేగ గడ్డిని గొర్రెలు మేసినట్ల యితే ఈ వాధి సూక్ష్మ క్రిముల ద్వారా ప్రబలుతుంది. వాడి పోయి మళ్లీ మొలచిన గడ్డిని గొర్రెలు మేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మందలో ఒకటి, రెండు జీవాలకు వ్యాధి కనిపించినట్లయితే, మిగిలిన వాటికి టీకా వేయించాలి. వలస వెళ్లే జీవాల్లో ఎక్కువగా ఈ వ్యాధి కనపడుతుంది. ■

కార్యసాధకునకు దీక్ష, పట్టుదలతోపాటు దృఢ సంకల్పం అత్యవసరం

# 10 సంవత్సరాలలో రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం !

**అ**న్నదాతకు ఆదాయం లేదు సామాజిక గౌరవం కానీ గుర్తింపుకానీ లేదు. 1990 సరళీకృత విధానాల వలన పారిశ్రామిక మరియు సేవారంగం ప్రపంచస్థాయి సాధించారు. కారణం : సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు, ప్రోత్సాహకాలు. ఈ వసతులు వ్యవసాయ రంగానికి అనేక కారణాల వలన అందుబాటులోకి రాలేదు. రైతులే కాలుష్యానికి కారణమని పురుగు మందులు, ఎరువుల వాడకం వలన ఆరోగ్య సమస్యలు వచ్చాయని నిందిస్తున్నారు. పాలు మరియు కోళ్ళు, గుడ్లు కలుషితం చేశారని ప్రచారం ఉన్నది. మానవులు ఆరోగ్యం కొరకు పుట్టిన తరువాత రోగ నిఆవారణ టీకాలు : పోలియో, టీబీ తదితర జబ్బులకు ముందు జాగ్రత్త వహిస్తారు. తరువాత వచ్చే అనేక జబ్బులకు ప్రభుత్వ మరియు ప్రయివేటు హాస్పిటల్‌లో నివారణ చేపించుకుంటారు. దీనికై ప్రపంచవ్యాప్తంగా తయారుచేసిన మందులు, పరికరాలు ఉపయోగిస్తున్నారు. డాక్టర్లకు కొత్తగా వచ్చిన మందుల వివరాలు తెలియచేసి వాటిని రోగులకు అందించేందుకు వసతులు ఏర్పాటు చేయబడినవి.

> **రై**తులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలు, వారిపై వస్తున్న అపనిందలు, ఇతర దేశాలలో జరుగుతున్న ఫలప్రదమైన వ్యవసాయ పరిశోధనలు, ప్రభుత్వాల సహాయ నిరాకరణ ధోరణులు, ఈ ప్రతికూల పరిస్థితులలో మళ్ళీ వ్యవసాయానికి, రైతుకు పూర్వవైభవం కల్పించడానికి అనుసరించవలసిన పరిష్కారమార్గాల గురించి పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి వ్యవసాయ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ పి. చెంగల్‌రెడ్డి సెలహాలు, సూచనలు కోరుతున్నారు. శ్రీ పి. చెంగల్‌రెడ్డి ఇ మెయిల్ ఐ డి: chengal.p@gmail.com

కానీ జీవమున్న పశువులకు, పంటలకు వచ్చే జబ్బులు, రోగాలకు సరి అయిన పరిష్కారాలు అందుబాటులోకి ప్రభుత్వాలు తేలేదు. జాతీయ రహదారుల కొరకై కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షల కోట్లు పెట్టుబడి చేసినది. కానీ జీవనాధారమైన నీటి ప్రాజెక్ట్‌లకు కేంద్ర ప్రభుత్వం కావలసినంత శ్రద్ధ చూపడం లేదు.

రైతు సమస్యలకు ముఖ్య కారణం పంటలకు రోగాలు, కీటకాలు, కరువు, తుఫాను, నీటి కొరత, ఎక్కువగా ఉన్నవి. భారతదేశంలో ప్రభుత్వాలు మనుషుల ఆరోగ్యానికి ఇచ్చిన ప్రాముఖ్యత పంటలు మరియు పశువుల ఆరోగ్యానికి ఇవ్వటం లేదు. పంటలపై పరిశోధనకై కావలసిన డబ్బు పెట్టుబడి శక్తి ప్రభుత్వాలకు గాని, పరిశ్రమలకు గాని లేవు. కానీ ఇతర దేశాలలో వ్యవసాయ పరిశోధనలపై ఎక్కువ పెట్టుబడితో ఫలితాలు సాధించారు. కానీ వీటిని మన రైతులకు అందుబాటులోకి రానీయక అనేక అడ్డంకులు జరుగుచున్నవి.

వీటి పరిష్కారం కొరకు రైతులు సంఘటితంగా, పంటల వారీ సమస్యల విశదీకరణ, పరిష్కార మార్గాలు తెలుసుకుని వాటి అమలుకు పార్లమెంటు సభ్యులు మరియు ఎం.ఎల్.ఏల ద్వారా అమలు చేయబడును. మీ సూచనలను, సలహాలను, ప్రణాళికలను, వ్యాసాలూ, పాటలు, వీడియోల ద్వారా పంపవలెను. వీటిలో ఎన్నుకోబడ్డ సూచనలకు బహుమతులు మరియు పురస్కారాలు ఇవ్వబడును. మీ ప్రాంతంలోని ఆదర్శ రైతులు, రైతులకు ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, గ్రామీణాభివృద్ధికి సేవ చేసిన సంస్థల వివరాలు పంపవలెను. ఆఖరు తేదీ : 15 ఆగస్టు 2019.


<u>వివరాలకు సంప్రదించండి :</u>

శ్రీమతి పి. ఉషారాణి, డైరక్టర్,

ఈమెయిల్ : peddireddiusha@gmail.com

శ్రీ వై. సూర్యశేఖర్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, ఈమెయిల్ : sekhar.ys@gmail.com

పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి వ్యవసాయ సంస్థ, ప్లాట్ నం. 209, విజయ టవర్స్, శాంతినగర్, హైదరాబాద్ – 500028. ఫోన్ : 040–23319643

ఈమెయిల్: ptrff.1992@gmail.com

వెబ్‌సైట్: www.indianfarmers.org


■

నీ మంచిని నీవు కోరుకున్నట్టే ఇతరులకు మంచి జరగాలనికూడా కోరుకో , అదే మానవత్వం

# గ్రామీణ మౌలిక సదుపాయాలు, సేవలు !

గ్రామీణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వాలు అమలు జరుపుతున్న పథకాలు అనేకం వున్నాయి. అయితే, ప్రజలలో వాటిని గురించిన అవగాహన తగినంతగా లేకపోవడం వల్ల ఆ పథకాలను ఆశించినంతగా సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ పథకాలు వ్యక్తిగత వికాసం మొదలుకొని, కుటుంబ, సంఘ, సమాజ పరిపూర్ణ వికాసం కోసం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్నాయి. ప్రతి పథకం లక్ష్యం వేరు, లక్ష్యంగా పెట్టుకున్న వినియోగ దారులు కూడా వేరు. మనిషిని శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా మరింత మెరుగైన స్థాయిలో నిలపాలన్న సంకల్పంతో ప్రతి పథకం కార్యాచరణను రూపొందించారు. ఈ పథకాలలో కొన్నిటి వివరాలను గత సంచికలలో తెలుసుకున్నాం. ఆ కోవకు చెందిన మరికొన్ని పథకాలను ఇప్పుడు చూద్దాం.

**మౌలిక సదుపాయాల కల్పన**

ఈ కార్యక్రమం కింద ప్రధానంగా స్వయం సహాయ సంఘాలకు, క్రీడా మైదానాలకు, పౌర సరఫరా వ్యవస్థకు , శ్మశాన వాటికలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలను సమకూర్చుతారు.

***అనుసరించే వ్యూహాలు***

- గ్రామాలలలోని ప్రజలు భాగస్వామ్య పద్ధతుల ద్వారా గ్రామంలో మౌలిక సదుపాయాల రూపకల్పనకు కృషిచేయడం
- మౌలిక సదుపాయాల రూపకల్పనకు కావల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం

***పథకాలు***

- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
- బలహీన వర్గాల గ్రాంటు
- సర్వ శిక్షా అభియాన్

***సాధించే ఫలితాలు:***

నాణ్యమైన ప్రజా ఆస్తులను నిర్మిచడం, స్వయం సహాయ సంఘాలు, పౌర సరఫరా వ్యవస్థ మెరుగుదల; యువజనుల అభివృద్ధి, క్రీడారంగం బలోపేతం.

**గ్రామీణ మార్కెట్లు**

***లక్ష్యం:*** గ్రామీణ ప్రాంతాలలో మార్కెట్లను అభివృద్ధి చేయడం

***అనుసరించే వ్యూహాలు***

- రైతులను, వస్తు ఉత్పత్తిదారులను సంప్రదించి మార్కెట్‌కు గ్రామంలో ఎక్కడ, ఎంత స్థలం కావలసి వస్తుందో గుర్తించడం
- టెండరు విధానం, అంచనా వేయడం, పనితీరును పరిశీలించుటకు సాంకేతిక సహాయాన్ని అందజేయడం

***పథకాలు***

- జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

***సాధించే ఫలితాలు:*** గ్రామీణ మార్కెట్లను నిర్మిచడం,వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించడం ద్వారా ఆర్థికాభివ ృద్ధిని సాధించడం

**గ్రామీణ ప్రాంతాలతో బ్యాంకుల అనుసంధానం**

***కీలక వనరులు:*** సూక్ష్మ బ్యాంకులు , పోస్ట్ ఆఫీస్ , ఏటిఎమ్, ఆధార్ కార్డులు

***లక్ష్యాలు:*** గ్రామీణ ప్రాంతాలతో బ్యాంకుల అనుసంధానం జరిగేలా భరోసా ఇవ్వడం

***అనుసరించే వ్యూహాలు***

- స్థానికంగా ఎన్ని బ్యాంకులు వున్నాయో, పోస్ట్ ఆఫీసు వుందో లేదో తెలుసుకోవడం
- బ్యాంకులు లేని ప్రాంతాలలో చిన్న స్థాయి ఏ టి ఎంల ఏర్పాటుకు కృషి చేయడం
- ఆధార్ కార్డులు నమోదు చేయుటకు ప్రతి ఇంటికీ

**తోటివారి పట్ల ప్రేమను చూపించాలి, మానవసేవకు మించిన భగవదారాధన మరొకటి లేదు**

తిరగడం

*పథకాలు:* ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన

*సాధించే ఫలితాలు:*

- 100% ఆర్థిక చేరిక
- 100% ఆధార్ నమోదు

*సాధించే ఫలితాలు:* పొదుపును పెంపొందించడం

**బ్రాడ్ బ్యాండ్,టెలికం కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటు**

*లక్ష్యాలు:* బ్రాడ్ బ్యాండ్, టెలికం కనెక్టివిటీ కల్పించడం, సాధారణ సేవల కేంద్రం ఏర్పాటు చేయడం

*అనుసరించే వ్యూహాలు*

- ప్రజలకు అవసరమయ్యే సేవల కేంద్రాన్ని గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేయుట
- ఈ- అక్ష్యరాస్యతను పెంచడానికి శిక్షణా తరగతులను నిర్వహించడం

*పథకాలు*

- సాధారణ సేవా కేంద్రాలు
- నేషనల్ ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్
- టెలీకం డిపార్టుమెంట్ పథకాలు

*సాధించే ఫలితాలు:* 100% ఇంటర్ నెట్ కనెక్టివిటీ , మొబైల్ కనెక్టివిటీ , కంప్యూటర్ సేవలను గ్రామీణ ప్రాంతాల వారికి అందించడం

**సాంఘిక భద్రత**

*లక్ష్యాలు:* అర్హులైన ప్రతి ఒక్కరికీ సాంఘిక భద్రత పథకాలు అందుబాటులోనికి వచ్చేలా చూడటం

*అనుసరించే వ్యూహాలు*

- ప్రతి ఇంటికీ తిరిగి అర్హులైన వారందరికీ ఫించను అందేలా చూడటం
- నిర్ణీత సమయానికి పించను అందేలా చూడటం
- బ్యాంకు ఎకౌంట్ తెరవటం
- ఐ జి ఎన్ ఓ ఎస్ ఏ పి
- ఐ జి ఎన్ డబ్ల్యు పి ఎస్
- ఐ జి ఎన్ డి పి ఎస్
- ఇతర రాష్ట్ర సాంఘిక పించను పథకాలు

*సాధించే ఫలితాలు :* అర్హులైనవారికి తగు సమయంలో పించను అందేలా చూడటం, వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు గౌరవప్రదమైన జీవితం అందించడం

**బీమా పథకాలు**

*లక్ష్యాలు:* భీమా పథకాలను సార్వత్రికంగా అమలు జరిగేలా చూడటం

*అనుసరించే వ్యూహాలు*

- ఇంటింటి సర్వే ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించడం
- స్వయం సహాయ సంఘాల ద్వారా బీమా అర్జీలను తయారు చేయించటం

*పథకాలు*

- ఆమ్ ఆద్మీ బీమా యోజన
- రాష్ట్రీయ ఆరోగ్య బీమా పథకాలు
- ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన

*సాధించే ఫలితాలు*

- జాతీయ భీమా పథకాల అమలును మెరుగు పరచడం
- ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన పథకం అమలు, మెరుగైన సాంఘిక క భద్రత ద్వారా ప్రజల ఆరోగ్య , ఆర్థిక ఇబ్బందులను తొలగించడం

**పౌర సరఫరాలు**

*లక్ష్యాలు:* ఇంటింటి సర్వే ద్వారా అర్హులైన వారిని గుర్తించి రేషన్ కార్డులు అందేలా చూడడం , సరైన సమయంలో ఆహర ధాన్యాలు అర్హులైన కుటుంబాలకు అందించడం ద్వారా జాతీయ ఆహర భద్రతా కార్యక్రం సక్రమంగా అమలు జరిగేలా చూడటం

*పథకాలు:* జాతీయ ఆహర భద్రతా చట్టం , రాష్ట్ర పౌర సరఫరాల పథకం

*సాధించే ఫలితాలు :* జాతీయ ఆహర భద్రతా చట్టం సక్రమంగా అమలు జరిగేలా చూడటం , ఆహర భద్రతను,

పోషకాహార భద్రతను మెరుగుపరచడం

**గ్రామ పంచాయితీలను బలోపేతం చేయడం**

*లక్ష్యాలు*

- ప్రజా సేవలను మెరుగు పరచుటకై గ్రామ పంచాయితీని, స్థానిక పాలనా సంస్థలను బలోపేతం చేయడం
- స్థానిక సంస్థలకు సరైన మౌలిక సదుపాయాలు సమకూర్చడం
- ఎన్నికైన ప్రజా ప్రతినిధులు , స్థానిక సంస్థలలో పనిచేసే అధికారుల సామర్ధ్యాల పెంపుదల
- పంచాయితీలలో కమిటీలు చురుకుగా పని చేసేటట్లు చూడడం
- ప్రజా భాగస్వామ్యం ద్వారా వాటర్ షెడ్ కమీటీలను, గ్రామ ఆరోగ్య ,పరిశుభ్రత కమిటీలను ఏర్పాటు చేయడం

*పథకాలు*

- బి ఆర్ జి ఎఫ్
- ఆర్ జి పి ఎస్ ఏ
- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం

*సాధించే ఫలితాలు:*

- గ్రామ పంచాయితీ మౌలిక సదుపాయాల మెరుగు
- కమిటీల పని తీరును మెరుగు పరచడం
- అధికారుల సామర్ధ్యాల పెంపుదల
- సమగ్రమైన స్థానిక ప్రజాస్వామ్యం

**సోషల్ ఆడిట్**

*లక్ష్యాలు:*

- గ్రామానికి సంబంధించిన అన్ని అంశాల పై అర్ధ సంవత్సర సోషల్ ఆడిట్లను గ్రామ సభ ద్వారా చేపట్టటం
- సోషల్ ఆడిట్ వివరాలను గ్రామంలో అందరికీ, స్వయం సహాయ సంఘ సభ్యులకు, గ్రామ రిసోర్స్ పర్సన్ లకు, జిల్లా రిసోర్స్ పర్సన్ లకు 15 రోజుల ముందుగా తెలియబరచడం
- వ్యక్తిగత వివరాల సేకరణ కోసం 100 శాతం ఇంటింటి సర్వే నిర్వహించడం
- ఈ సర్వేలో వ్యక్తి గత వివరాలను, వ్రాతపూర్వక ఆర్జీలను సమగ్రంగా పరిశీలించడం
- సోషల్ ఆడిట్ ను నిర్వహించడం ద్వారా సంబంధిత అధికారులకు గ్రామ సభ ఆడిట్ వివరాలను చదివి వినిపించడం

*పథకాలు:* అన్ని పథకాలు

*సాధించే ఫలితాలు:*

గ్రామ పంచాయితీ పరిధిలో అమలు చేయబడుతున్న అన్ని కార్యక్రమాలపై సోషల్ ఆడిట్ ను నిర్వహించడం , ప్రభుత్వ, సమాజ నిధులను ఖర్చు చేయటంలో సమగ్ర పారదర్శకతను సాధించడం

**ముందస్తు సమాచారం**

*లక్ష్యాలు:*

- స్థానిక పాలనా సంస్థలు అమలుచేసే అన్ని పథకాలను గురించి ప్రజలకు ముందస్తు సమాచారం అందజేయుట
- గ్రామ పంచాయితీ పరిధిలో అమలు జరుగుతున్న కార్యక్రమాలలో ఈ క్రింది విషయాలలో సమాచారం సేకరించడం:
  - వివిధ విధులను నిర్వహిస్తున్న సిబ్బంది హెూదా, వ్యక్తిగత వివరాలు
  - వివిధ పథకాలకు లబ్ధిదారులుగా ఉండటానికి కావలసిన అర్హతల వివరాలు
  - సేవల వివరాలు , నియమ నిబంధనల వివరాలు
  - గ్రామ పంచాయితీ పరిధిలోని లబ్ధిదారుల వివరాలు
  - లబ్ధిదారుల గుర్తింపు , ప్రాధన్యత లోని కీలక అంశాల వివరాలు
  - గ్రామ పంచాయితీ స్థాయిలోని ఆమోదం పొందిన బడ్జెట్ వివరాలు

- ప్రతి ఒక్క లబ్ధిదారునికి మంజూరైన బడ్జెట్ వివరాలు
- ప్రతి ఒక్క అంశం క్రింద ఆమోదం పొందిన బడ్జెట్ కేటాయింపు, ఖర్చు వివరాలు
- బ్లాకు , జిల్లా పరిధిలోని వివిధ సంస్థల రికార్డుల వివరాలు
- ప్రోజెక్టు అమలు చేయుచున్న సంస్థ వివరాలు
- పై విషయాల పైన సమగ్ర సమాచారం సేకరించి గోడల మీద, నోటీస్ బోర్డులలో, బహిరంగ ప్రదేశాలలో కనిపించేలా ఏర్పాటుచేయడం

***పథకాలు:*** సమాచార హక్కు చట్టం, 2005

***సాధించే ఫలితాలు:*** సమాచార హక్కు చట్టం, 2005 సెక్షన్ క్రింద గ్రామ పంచాయితీని విశ్వాసం లోకి తీసుకోవడం, ప్రజా ధనం వినియోగం విషయంలో పరిపూర్ణమైన పారదర్శకత

**సరైన సమయంలో సమస్యల పరిష్కారం**

***లక్ష్యం:*** ప్రజల సమస్యల పరిష్కారం

***అనుసరించే వ్యూహాలు :***

- రాత పూర్వకంగా సమస్యలను నివేదించిన సభ్యులందరికీ తేదీతో కూడిన రశీదుకు అర్హత కల్పించుట
- ప్రతిరోజూ ప్రజల సమస్యలను స్వీకరించుటకుగాను గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని ఎల్లవేళలా అందుబాటులో ఉంచడం
- గ్రామ పంచాయితీ స్వీకరించిన రాతపూర్వక సమస్యలను సంబంధిత సంస్థలకు అందజేయుట
- గ్రామ పంచాయితీ నుండి స్వీకరించిన రాతపూర్వక సమస్యలను, వినతులను సంబంధిత సంస్థలు 21 రోజులలోగా పరిష్కరించుట

***పథకాలు:*** అన్ని పథకాలు

***సాధించే ఫలితాలు:*** ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడం , గ్రామ పంచాయితీ పరిధిలోని అభివృద్ధి పథకాల అమలులోని సమస్యలను సకాలంలో పరిష్కరించడం

**సకాలంలో సేవలను అందించడం**

***లక్ష్యాలు:***

- సకాలంలో ప్రజలకు అవసరమయ్యే సేవలను అందించడం
- ఈ – గవర్నెన్స్ ద్వారా నాణ్యమైన సేవలను అందించడం

***అనుసరించే వ్యూహాలు :***

- పౌర సేవల కాల వ్యవధి పట్టిక (సిటిజన్ చార్టర్) లోని అంశాలను అందరికీ తెలియజేయుట
- ప్రభుత్వ ఉద్యోగుల, పంచాయితీ సిబ్బంది హాజరును గమనించడం
- గ్రామ పంచాయితీలకు కంప్యూటర్ సదుపాయం కలిగించడం
- సమస్యల పరిష్కారం , పథకాల మూల్యాంకనం కోసం ఈ – గవర్నెన్స్ దరఖాస్తులను ప్రవేశపెట్టుట

***పథకాలు:***

- ఆర్ జి పి ఎస్ ఏ – రాజీవ్ గాంధీ పంచాయిత్ స్వశక్తీ కరణ్ అభియాన్
- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం
- ఎమ్ పి లాడ్స్
- బి ఆర్ జి ఎఫ్

***సాధించే ఫలితాలు:***

- పౌరులకు సకాలంలో అవసరమైన ముఖ్యమైన సేవలను అందించడం
- ముఖ్యమైన పథకాల పర్యవేక్షణ
- స్థానిక ప్రభుత్వాన్ని బలోపేతం చేయడం

**గ్రామ సభ, మహిళా సభ ,బాలల సభల ఏర్పాటు**

***లక్ష్యాలు:*** క్రమం తప్పకుండా గ్రామ సభ, మహిళా సభ, బాలల సభలను ప్రజల భాగస్వామ్యంతో

# ప్లాస్టిక్ కాలుష్యాన్ని తుదముట్టించండి

## ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ నినాదం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 5 వ తేదీన జరుపుకుంటున్నాం. 1972 వ సంవత్సరంలోనే ఈ దినోత్సవానికి ఏర్పాట్లు జరిగినప్పటికి రెండు సంవత్సరాల తర్వాతి నుంచి (1974) ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం జరుగుతున్నది.



పర్యావరణం పైన ప్రజలలో అవగాహన పెంపొందించి, పర్యావరణ సంరక్షణకు కృషిచేయడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. పర్యావరణ కాలుష్యం నుంచి గ్లోబల్ వార్మింగ్ వరకు, ఆహార భద్రత నుంచి వన్యప్రాణుల సంరక్షణ వరకు ఎన్నెన్నో అంశాలపై అవగాహనకు కృషిచేయడం జరుగుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా 143 దేశాలలో పర్యావరణ దినోత్సవాన్ని పాటిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మాదిరిగానే ప్రతి ఏడాది ఒక నిర్దిష్ట అంశంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తారు.

'ప్లాస్టిక్ కాలుష్యాన్ని తుద ముట్టించండి' అనేది ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ నినాదం. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, సామాజిక బృందాలు, ప్రముఖ వ్యక్తులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు మొదలైన వారు కలసికట్టుగా పర్యావరణ దినోత్సవంలో పాల్గొని ప్రపంచ ప్రజలకు మార్గదర్శనం చేస్తారు. ఈ అంతర్జాతీయ దినోత్సవానికి ఏటా ఒక దేశం నిర్వాహక బాధ్యత వహిస్తుంది.

ఈ ఏడాది మన దేశమే నిర్వాహక దేశం. క్రిందటి ఏడాది కెనడా నిర్వాహక దేశంగా వున్నది. మనదేశం ఆధ్వర్యంలో జరుగుతున్న పర్యావరణ దినోత్సవ సందేశాన్ని మనమందరం గౌరవించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవడం మనదేశానికి గౌరవప్రదంగా వుంటుంది. ■

---

నిర్వహించడం ద్వారా సరైన నిర్ణయాలు తీసుకోవడం

***అనుసరించే వ్యూహాలు :***

- ప్రజా భాగస్వామ్యం వలన కలిగే ప్రయోజనాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం
- మహిళలకు ప్రత్యేకమైన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా స్త్రీలు , బాలల సంబంధిత విషయాలు చర్చించడం
- విద్య, వినోదం , సురక్షిత పద్ధతుల పై బాలలకు ప్రత్యేక సభ నిర్వహించడం
- ప్రజా ప్రతినిధులు (పార్లమెంట్ , శాసన సభ సభ్యులు) గ్రామ సభకు హాజరు అయ్యేలా చూడటం
- స్వయం సహాయ సంఘం సభ్యులను ప్రత్యేక మహిళా, బాలల గ్రామ సభ నిర్వహించేలా ప్రోత్సహించడం

***పథకాలు:*** రాష్ట్ర పంచాయితీ రాజ్ చట్టం

***సాధించే ఫలితాలు:*** గ్రామ వనరుల వినియోగం పై ప్రజల అవసరాలకు, మనోభావాలకు అనుగుణంగా గ్రామసభలో చేసే నిర్ణయాలను తీసుకోవడం , గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్యం పటిష్ఠమయ్యేలా చూడడం ■

**పరిస్థితులు నీ అదుపులో వుండకపోవచ్చు , కాని నీ ప్రవర్తన నీ అదుపులోనే వుండాలి కదా!**

# జి ఐ సి , జి ఐ జడ్ సమీక్షా సమావేశాలు



చిత్తూరు జిల్లాలో 'మాస్' కార్యక్రమాలపై 'మాస్' సి ఇ ఓ , ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి సమీక్ష



సాధికారత ఫౌండేషన్ సి ఇ ఓ శ్రీ పాపిరెడ్డి సమీక్షా సమావేశాలు



రాయలసీమ ఎఫ్ పి ఓ లు, వాటి ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులకు హైదరాబాద్‌లో 'మాస్' శిక్షణ




'మాస్' టమాటో వ్యవహారాల నిపుణుడు శ్రీ జగన్మోహన రెడ్డి తైవాన్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న దృశ్యాలు

MAHILA SADHIKARATHA
Publication Date: 01-06-2019; Posting Date: 05-06-2019
RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2018-20

## ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలనుంచి ఇటీవల ఎన్నికైన మహిళా పార్లమెంట్ సభ్యులు


**గొట్టేటి మాధవి**
ఆంధ్రప్రదేశ్


**కె సత్యవతి**
ఆంధ్రప్రదేశ్


**వంగా గీత**
ఆంధ్రప్రదేశ్


**చింతా అనూరాధ**
ఆంధ్రప్రదేశ్


**మాలోతు కవిత**
తెలంగాణా

## ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఇటీవల ఎన్నికైన మహిళా శాసన సభ్యులు


**రెడ్డి శాంతి**
పాతపట్నం


**వి. కళావతి**
పాలకొండ


**పి పుష్పశ్రీవాణి**
కురుపాం


**కె.భాగ్యలక్ష్మి**
పాడేరు


**ఎ. భవాని**
రాజమండ్రి


**ఎన్ ధనలక్ష్మి**
రంపచోడవరం


**టి. వనిత**
కొవ్వూరు


**ఎం. సుచరిత**
ప్రత్తిపాడు


**వి రజని**
చిలకలూరిపేట


**యు శ్రీదేవి**
తాడికొండ


**కె శ్రీదేవి**
పత్తికొండ


**జె పద్మావతి**
సింగనమల


**కె వి ఉషశ్రీ**
కల్యాణ దుర్గం


**ఆర్ కె రోజా**
నగరి

**బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి**
ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089